# విద్యార్థి జ్వాల

Rs. 12/- per copy
Vol. 30 - No.10
August 2024



## దేశమంటే మట్టి కాదు

సంపాదకీయం

# వట్టి మాటలు కట్టి పెట్టోయ్!

*"దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా*
*దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ !*
*వట్టి మాటలు కట్టి పెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్"*

అంటూ 1910వ సంవత్సరంలో అభ్యుదయ కవి శ్రీ గురజాడ అప్పారావు గారు రాసిన ఈ గేయం దేశభక్తిని ప్రబోధించి, సాంఘిక పరివర్తన కోసం దేశ ప్రజలను నాడు నేడు ఎంతో ఉత్తేజపరుస్తూ ఉంది.

దేశాన్ని ప్రేమించడం అంటే ప్రాథమికంగా దేశంలోని మనుషులను ప్రేమించడమే. దేశ ప్రజలందరినీ కుల మతాలతో, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా నిస్వార్థంగా ప్రేమించడం, గౌరవించడం, వారికి మేలు చేయడం నిజంగా గొప్ప సవాలు, త్యాగంతో కూడిన విషయం. మరిముఖ్యంగా అంటరాని వారిని, అణగారిన వారిని, కుష్టు వ్యాధిగ్రస్తులను, కొండల్లో, మారుమూల ప్రాంతాల్లో నివసించే వారిని, నాగరికత తెలియని వారిని ప్రేమించడం, అక్కున చేర్చుకోవడం, శుభ్రతలేని వారి శరీరాలను, రసికకారే పుళ్ళను సైతం ముట్టుకుని, కడిగి, తుడిచి, చికిత్స చేసి, విద్య నేర్పించడమే నిస్వార్థమైన ప్రేమే.

జనవరి 22, 1999వ సంవత్సరం అర్ధరాత్రి 12 గం॥ లకు ఒరిస్సాలో కుష్టురోగులకు సేవచేస్తున్న ఆస్ట్రేలియా మిషనరీ గ్రేహం స్టెయిన్స్‌ను, ఆయన ఇద్దరి బిడ్డలను మత ఛాందసవాదులు అత్యంత కిరాతకంగా సజీవ దహనం చేశారు. ఈ విషయంపై స్పందిస్తూ అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ఇలా అన్నాడు. "ఎన్నో సంవత్సరాలు కుష్టురోగుల కొరకు తమ జీవితాన్ని వెచ్చించి, సేవ చేసిన వారికి కృతజ్ఞత చూపలేదు సరికదా, ఈ విధమైన మరణానికి అక్కడున్న వాళ్ళు కారకులయ్యారు. హిందూ దేశం మత సహనానికి, మానవత్వానికి పెట్టింది పేరు. ఈ ఘాతుక చర్య ప్రపంచపు చీకటి క్రియల ఉత్పాదనేమో అనిపిస్తుంది". స్థానికంగా జీవించే కుష్టువారైతే "మా ప్రపంచం చీకటిమయం. మృత్యువును సమీపించేవారం. మేము కనబడినప్పుడు రాళ్ళు రువ్వేవారు. అంటరాని వాళ్ళమని నీచంగా చూసేవారు. పూర్వ జన్మ పాపం వల్ల వ్యాధి వచ్చిందని, పురుగుల్లా అడవుల్లో చనిపోవాలని కోరుకొనేవారు. దొరగారు, అమ్మగారు మమ్మల్ని అప్యాయంగా దగ్గరకు తీసికొని, మా పుండ్లు కడిగి మాకు క్రీస్తు బోధలన్నీ కథలుగా వివరించి చెప్పేవారు. అంత దయగల బాబు మాకు దూరమయ్యాడని" బోరున విలపించారు.

నిజమైన ప్రేమ ప్రేమించబడే వ్యక్తి యొక్క మేలు కోరుతుంది, హాని కలిగించదు, ఇస్తుంది, క్షమిస్తుంది, స్వార్థాన్ని పక్కన పెట్టి త్యాగాన్ని కనబరుస్తుంది. ఇలాంటి నిజమైన ప్రేమకు మూలము దేవుడే, దేవుడు ప్రేమా స్వరూపి (1 యోహా 4:7,8). దేవుని ప్రేమను రుచి చూసిన వ్యక్తులు గ్రేహం స్టెయిన్స్‌లా వ్యక్తులను ప్రేమిస్తారు. సాటి భారతీయులు, దేశభక్తులు అని చెప్పుకొనేవారు తోటి వారిని ప్రేమించాల్సింది పోయి వ్యక్తుల స్థితిగతులను బట్టి వారి హృదయాలు ద్వేషంతో నిండుకొంటున్నాయి.

చింత చెట్టుకు ఆపిల్ పండ్లు కాస్తాయని ఆశిస్తామా? అస్సలు ఆశించలేము. అలాగే స్వార్థం, ద్వేషం, క్రోధం, దౌర్జన్యం, కుళ్ళు, కుతంత్రాలు, కక్షలు, పంతాలు, కులం, మతం అడ్డుగోడల్ని పెంచిపోషిస్తూ హింసను కోరుకొనే వ్యక్తుల నుంచి దేశభక్తిని ఆశించలేము. దేశాన్ని నిజంగా ప్రేమిస్తే మాటల్లో కాకుండా చేతల్లో చూపిస్తారు. దేశాన్ని ప్రేమించేవారు అవినీతికి, అక్రమాలకు, దోపిడీకి, హింసకు పాల్పడరు, కుల, మత ద్వేషాలు రెచ్చగొట్టరు, అన్యాయాన్ని ఎదిరిస్తారు, లంచగొండితనాన్ని అంతమొందిస్తారు. తోటి మనిషిని సోదర ప్రేమతో చూస్తారు. నిజాయితీగా జీవిస్తారు. రాజ్యాంగాన్ని గౌరవిస్తారు. దేశ సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తారు. ప్రకృతి వనరుల్ని నాశనం చేయరు.

దేశభక్తి కొందరి సొత్తుకాదు. దేశాన్ని, దేశ ప్రజలను నిస్వార్థంగా ప్రేమించి, దేశానికి సేవచేసే ప్రతి ఒక్కరూ దేశభక్తులే, వారు స్వదేశీలైనా, విదేశీలైనా. ఇతరదేశాల్లో పుట్టినా తమ జీవితాన్ని భారతదేశ ప్రజల కొరకు త్యాగం చేసినవారు ఎందరో ఉన్నారు. వారిలో విలియంకేరి, సిపి బ్రౌన్, హెన్రీ మార్టిన్, సర్ ఆర్థర్ కాటన్, హయ్యర్, మదర్ థెరిస్సా, సియఫ్ ఆండ్రూస్, ఐడా స్కడ్డర్, గ్రేహం స్టెయిన్స్ మొ॥వారు. వీరు వీరి దేశాన్ని, బంధుమిత్రులను, సంపాదనలను, సుఖాలను విడిచి దేవుని ప్రేమను తోటిమానవుల పట్ల చూపించారు.

నిస్వార్థమైన దేశభక్తి, నిజమైన దైవభక్తి నుంచే వస్తుంది. దైవభక్తి దేవునితో ఉండే సంబంధాన్ని బట్టి వస్తుంది. ఒక వ్యక్తి నిజదేవుడైన యేసుక్రీస్తుతో ఎంత ఎక్కువ సహవాసం కలిగివుంటాడో ఆ వ్యక్తి అంత నిజాయితీగా, నిస్వార్థంగా జీవిస్తూ, తోటివారిని ప్రేమిస్తూ, వారికి సేవ చేస్తాడు. దేశాన్ని పాడుచేసే మతతత్వం, వ్యభిచారం, జారత్వం, అవినీతి, లంచగొండితనం, గురుభక్తి, కుల, వర్గ, ప్రాంతీయ బేధాలు నిర్మూలమయ్యేటట్లు విజ్ఞాపన చేస్తాడు. దైవభక్తి కొదువైతే దేశభక్తి కొదువవుతుందనే సత్యాన్ని గమనించి దైవభక్తిలో ఎదుగుతూ దేశప్రజలను ప్రేమిద్దాం, వారికి మేలు చేద్దాం.

**– పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 10 August 2024
A Publication of
Union of Evangelical Students of India



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod, Member
Mr. K. Adam - Sec., Litt.Dept.


SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-

FOR SUBSCPRICTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account No: 36698741798**
**Account Name: uesiap vj**
**IFS Code: SBIN0011994**
**SBI Nambur Branch**
**UPI ID: uesiapvj@sbi**


CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com


UPCOMING TOPICS:

September : Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**

# Indian National Pledge

India is my country.

All Indians are my brothers and sisters.

I love my country and, I am proud of it's rich and varied heritage.

I shall always strive to be worthy of it.

I shall give my parents, teachers and all elders respect and treat everyone with courtesy.

To my country and my people,
I pledge my devotion.

In their wellbeing and prosperity
alone, lies my happiness.



## లోపలి పేజీల్లో...


- వట్టి మాటలు కట్టి పెట్టోయ్! - 2
- శక్తిని పొందుకొందాం - 4
- దేశమంటే మట్టి కాదు - 5
- భారతదేశ స్వాతంత్ర్యం - క్రైస్తవ నాయకత్వం - 8
- క్రైస్తవ్యం విదేశీ మతమా? - 11
- పండిత రమాబాయి - 13
- మన కుటుంబాల ద్వారా ఆశీర్వాదమా? శాపమా? - 15
- రాలుతున్న రత్నాలు - 18
- పిరికి వాడివా? పరాక్రమ బలాఢ్యుడివా? - 19
- పిల్లలు లేకపోవడం శాపమా? - 20
- సమకాలీన క్రైస్తవ దురాచారాలు - 24
- పాపము - 27
- అ'జాగ్రత్త'- 30
- అవినీతి జెండాలు- 32

# శక్తిని పొందుకొందాం

"ఆధ్యాత్మిక శక్తి లేకుండా ఆధ్యాత్మికమైన పనులు చేయడానికి ప్రయత్నించినప్పుడు మనం ఘోరంగా విఫలమవుతాం" అని అంటారు గొప్ప అమెరికన్ పాస్టర్, రచయిత, ఏ. డబ్ల్యు. టోజర్.

అద్వితీయుని - అభిలాష, సర్వోన్నతుని - స్వప్నం, పరమ తండ్రి - ప్రణాళిక నెరవేరాలంటే మనం ఆరోగ్యంగా ఉండాలి. మన ఆరోగ్యం మహోన్నతుని మనసు తెలుసుకోవడం ద్వారా ఆయన మాటలను ఆహారంగా చేసుకోవడం ద్వారా లభిస్తుంది. మనుష్యుడు రొట్టెవలన మాత్రం కాదు గాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును. అంటే జీవితంలో దేవుని మాటలను ప్రధానమైనవిగా ఎంచి, మన ప్రాధాన్యతలను సరి చేసుకోవాలి.

పవిత్ర లేఖనాల పఠనం మనల్ని పరిశోధించి, పవిత్రీకరించి, ప్రకాశింపచేసి, ప్రగతి పథంలో నడిపించాలి. ప్రపంచ అధినేతలను మన ప్రయోగాత్మక జీవితం ద్వారా ప్రభావితం చేయాలి. ప్రభువుకు ప్రతినిధులుగా, ప్రతిబింబాలుగా, ప్రవక్తలుగా మనల్ని తీర్చిదిద్దాలి.

సరళమైన సువార్త సత్యాన్ని సమాజానికి సంతృప్తికరంగా/సమృద్ధిగా అందించాలంటే ఆధ్యాత్మిక సామర్థ్యం చాలా అవసరం. ఈ సామర్థ్యాన్ని సంపాదించడానికి ఒకే ఒక ప్రధాన మార్గం బైబిల్‌ను క్రమంగా చదవడం, ధ్యానించడమే.



విశ్వాసులు తగినంత ఆత్మీయ ఆరోగ్యం కలిగి ఉండకపోవడానికి ఒక ప్రధానమైన కారణం ప్రభువు ఆశించిన మోతాదులో బైబిల్‌ని చదివి, పాటించకపోవడమే.

బైబిల్లోని 66 గ్రంథాలు లేనప్పుడు కేవలం పరిమితమైన పుస్తకాలు మాత్రమే అందుబాటులో ఉన్నప్పుడు ఎజ్రా, యెహోవా ధర్మశాస్త్రమును పరిశోధించి దాని చొప్పున నడుచుకోవడానికి, ఇశ్రాయేలీయులకు దాని కట్టడలను విధులను నేర్పడానికి దృఢ నిశ్చయం చేసుకొన్నాడు. బైబిల్ చదవడానికి ఇష్టం, శ్రద్ధ లేనివారు ఆయన కార్యాల్లో విజయాన్ని సాధించలేరు. దేవుని ఉద్దేశం నెరవేర్పుకు దేవుని ప్రజల ఆశీర్వాదానికి రహస్యం బైబిల్‌ని చదవడం అని గుర్తించి దానినే ప్రాధాన్యతగా చేసుకొని దానియందు ప్రావీణ్యత సాధించాడు. తన ప్రావీణ్యత తన ప్రయోగాత్మక జీవితంలో ప్రస్ఫుటంగా ప్రభుత్వాలకు, ప్రభువులకు, పరిపాలకులకు కనిపించేలా జీవించాడు. ఈ సత్యం మనల్ని కూడా ఎజ్రాలా జీవించడానికి ప్రోత్సహించాలి. ప్రస్తుత కాలంలో అలా జీవించడానికి మనం కూడా పరిశ్రమించాలని ప్రతిజ్ఞ చేద్దాం.

తన జీవితంలో వ్యక్తుల్ని క్రీస్తు ప్రేమకు పరిచయం చేసి వారిని క్రీస్తు స్వరూపంలోకి మార్చడానికి విశ్వ ప్రయత్నం చేసిన ప్రముఖుల్లో ఒకరు జాన్ స్టాట్ (ప్రపంచవ్యాప్త ఐయఫ్ఇయస్ రాయబారి). ఇలా ఉండడానికి తనను బలపరిచిన అంశాలు - క్రమమైన వాక్య ధ్యానం, ధ్యానంలో దేవుడు నేర్పిన విషయాలను అనుదిన జీవితంలో పాటించడమే.

ఈ ఆగస్ట్, సెప్టెంబర్ నెలలు ప్రభువు ప్రేమను పరిచయం చేయడానికి మనకు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి. విద్యార్థులకు ఆయన ప్రేమను పరిచయం చేయాలన్నా, పరిచయం చేసిన తర్వాత వారిని పరిణతి చెందిన వారిగా తీర్చిదిద్దాలన్నా మన పాత్ర కీలకం. వీటిని ఆచరించడంలో మన ఆధ్యాత్మిక శక్తిని పరిపూర్ణంగా వినియోగిద్దాం. వినియోగానికి ముందు ఆధ్యాత్మిక శక్తిని సంపాదిద్దాం. ఎందుకంటే ఆధ్యాత్మిక శక్తి లేకుండా ఆధ్యాత్మిక పని చేయడానికి ప్రయత్నించినప్పుడు మనం ఘోరంగా విఫలమవుతాం. మన జీవితం విఫలమవ్వడానికి కాదు గాని అంతిమ విజయానికే. వ్యక్తుల్ని యేసయ్య ప్రేమకు పరిచయం చేసి వారిని ఆయన స్వారూప్యంలోకి తీర్చిదిద్దడమే అసలైన విజయం. అదే మన అంతిమ ధ్యేయం.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్

యుఐయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# దేశమంటే మట్టి కాదు

"దేశభక్తి ఎప్పుడూ దేశం కోసం చనిపోవడం గూర్చి మాట్లాడుతుందే గానీ, దేశం కోసం చంపడం గూర్చి కాదు" అని బెర్ట్రాండ్ రస్సెల్ అంటాడు. "మనం మొదట భారతీయులం, ఆ తర్వాతే హిందువులమైనా, ముస్లిములమైనా" ఇది మహాత్మాగాంధీ వ్యాఖ్యానం. "మనం మొదట, చివర కూడా భారతీయులమే కావాలి. భారతీయులుగా తప్ప మరొకటి కాకూడదు" ఇది డాక్టర్ అంబేద్కర్ వ్యాఖ్యానం. కానీ క్రైస్తవులుగా మన అవగాహన ఇంకొంచెం ముందుకెళ్ళాలి. ఈ అవగాహన కోసమే ఈ వ్యాసం.

## అర్థం, అపార్థం

దేశాభిమానం, దేశభక్తి రెండూ ఒకటి కాదు. మొదటిది పేట్రియాటిజం. రెండవది పేట్రియాటిజానికి మన మేధావులు ఇచ్చిన అనువాదం. ఇది సరైన అనువాదం కాదు. వక్రీకరించబడిన అర్థం.

## దేశాభిమానం

పేట్రియాటిజం అంటే దేశాభిమానం, దేశప్రేమ. దేశమంటే మట్టి కాదు. చెట్లు, పుట్ట, నదులు, సముద్రాలు, కొండలు, నదీ సంగమాలు కాదు. దేశమంటే ప్రజలు. ప్రజలు లేకుండా ప్రదేశానికి విలువ, ప్రాముఖ్యత లేదు. ప్రజల వలనే వీటికి ప్రాముఖ్యత, విలువ వచ్చింది. దేశప్రేమ, దేశాభిమానం అంటే చెట్టు పుట్టలకు, స్మారక కట్టడాలకు, పూర్వీకులు సృష్టించిన శిల్ప సౌందర్యానికి, నదులు సముద్రాలకు హారతులు పట్టడం కాదు, తేనెల తేటల మాటలతో కీర్తించడం, పొగడడం అంతకంటే కాదు. దేశ ప్రజలను ప్రేమించడం, దేశ ప్రజలను అభిమానించడం, గౌరవించడం, ఆదరించడం, సమాజ పురోగతి కొరకు పునరంకితమవ్వడం. అది పేట్రియాటిజం. దేశ పేరు ప్రతిష్టల కొరకు, గౌరవ మర్యాదల కొరకు ఆలోచనలో, ఆచరణలో, పునరంకితమవ్వడం పేట్రియాటిజం.

## దేశభక్తి

దేశభక్తి అనగా ఒక వ్యక్తి తన దేశంపైన చూపే ప్రేమ, అభిమానం, గౌరవం. ఇది ప్రజాస్వామ్య విలువలతో కూడిన ఆచరణ యోగ్యమైన స్పందన. దేశభక్తిని స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలకు చూపించే గౌరవం, కృతజ్ఞతా భావన అని కూడా చెప్పవచ్చు.

## జాతీయత

దేశ భక్తికి భిన్నంగా జాతీయవాదం ఉంటుంది. తమ దేశం పట్ల ఉన్న ప్రేమను ఇతర దేశాల పట్ల ఉన్న గౌరవానికి అతీతంగా పక్షపాత వైఖరితో చూపించేది. జాతీయవాదంలో ఒక జాతి మరొక జాతి కంటే ఉన్నతమైనదని భావించి దానిని అన్ని విధాలుగా మరి ముఖ్యంగా రాజకీయంగా సాధించే ప్రయత్నం చేయడం. జాతీయ భావాన్ని విశ్వసించే వారు 'మనము', 'ఇతరులు' అనే వ్యత్యాస భావనను ప్రజల్లో కలిగిస్తారు. వారు స్వజాతి వారిని జాతీయ వాదులని, దేశభక్తులని, మిగతా వారిని 'చొరబాటుదారులని' (intruders) నమ్మ జూపుతారు. శుద్ధ-అశుద్ధ (Purity-Impurity) అనే భావనను లేవదీసి దానికి మతపరమైన భావజాలాన్ని ఆపాదించి, ఆ శుద్ధతను కాపాడుటయే 'దేశ భక్తి', 'ధర్మమని' ప్రచారం చేస్తారు. దానికి వారు ఒక నాగరికతను, భాషను, మతాన్ని అంటగడతారు. వారు

శక్తివంతమైన, నిరంతర జాతీయతను ప్రోత్సహిస్తారు. ఫాసిస్ట్ పాలకులు నిరంతరం దేశభక్తి నినాదాలు, మత పరమైన సమావేశాలు, చిహ్నాలు, పాటలు, జెండాలను ఉపయోగిస్తారు. కొందరిని దేశ శత్రువులుగా చిత్రీకరించి సొంత ప్రజల మానవ హక్కులను విస్మరిస్తారు. మిలటరీ, మీడియా ఆధిపత్యాన్ని చెలాయిస్తారు. ఇతర దేశాలను శత్రువులుగా చూపి ప్రజల భయాన్ని పూర్తిగా సొమ్ము చేసుకొంటారు.

## బైబిల్ దేశభక్తి

దీనికి భిన్నంగా బైబిల్ భూమిపై ఉన్న అన్ని దేశాలను దేవుడు ప్రేమిస్తున్నాడని ప్రబోధిస్తూ మతపరమైన హింసను నిరసిస్తుంది. "యూదుడు లేదా అన్యజనుడు, బానిస లేదా స్వతంత్రుడు లేదా స్త్రీ మరియు పురుషుడు అని లేరు, ఎందుకంటే అందరూ క్రీస్తు యేసులో ఒక్కటే" (గల. 3:28) అనే పౌలు యొక్క ప్రసిద్ధ వాదన దేవుని రాజ్యంలో జాతీయవాదం ఎప్పటికీ భాగం కాకూడదని నిరూపిస్తుంది. కాబట్టి క్రైస్తవుడు మొదట దైవభక్తిని అలవాటు చేసుకోవాలి. దేవుని యెడల భయము, భక్తి ఉంటే దేశం యెడల ఉన్నట్లే (సామె 9:10) తన స్వదేశాన్ని ప్రేమిస్తూనే, బాధ్యతగా ఉంటూనే విశ్వ మానవ సమతా భావాన్ని అలవరచుకోవాలి. 'తల్లి చెడ్డదైనా మంచిదైనా ప్రేమిస్తాను' అని అనడంలో అర్థం ఉంది కానీ 'ఆమె చేసే చెడును మంచి అని సమర్థిస్తాను' అని అనడంలో మోసం ఉంది అంటాడు జి కె చెస్టర్‌టన్. మరో మాటలో చెప్పాలంటే, నిజమైన, మంచి దేశభక్తి కలిగి ఉండడమంటే ఆ దేశం యొక్క విజయాలు, దాని లోపాలను అంచనా వేయగలగాలి.

## నిజమైన దేశభక్తులెవరు?

ఎవరిని దేశభక్తులని అంటాం? యుద్ధవీరులనా? సునిశిత మేధస్సు గలవారినా? రాజనీతిజ్ఞులనా? వ్యాపారస్తులనా? కొన్ని కులాల వారినా? కొన్ని మతాల వారినా ? ఒక మతాన్ని, కులాన్ని, నాయకుని పొగిడిన వారినా? కాదు! ఇవన్నీ పాక్షికమైనవే. సంపూర్ణమైనవేవీ కాదు. వ్యక్తిగత నైతికత యెడల చిత్తశుద్ధి అనేది మౌళికంగా ఉన్నతికి, దేశ భక్తికి పునాది. కాబట్టి, నిజమైన దేశభక్తునికి మొట్టమొదట ఉండాల్సిన లక్షణం నిజాయితీ. వ్యక్తిత్వం లేని దేశభక్తి దుర్మార్గుల ధర్మంగా రూపాంతరం చెందుతుంది.

- ❈ ఒక ప్రజా ప్రయోజనానికి సంబంధించి ప్రేరణ పొందినవాడే దేశభక్తుడు.
- ❈ దేశంలోని అసమానతలకు కారణమైన వ్యవస్థలను ప్రశ్నించేవాడు దేశభక్తుడు.
- ❈ యోగా అభ్యాసం చేసే వానికంటే, అక్రమంగా సంపాదించని వాడు దేశభక్తుడు.
- ❈ పన్నులు ఎగ్గొట్టే వానికంటే, వాటిని చెల్లించేవాడు దేశభక్తుడు.
- ❈ మనిషిని పశువులా చూసే వానికంటే, మనిషిని మనిషిలా చూసేవాడు దేశభక్తుడు.
- ❈ మందిరాలకన్నా, విజ్ఞాన గ్రంథాలయాలను నిర్మించేవాడు దేశభక్తుడు.
- ❈ చట్టాలను తన చేతుల్లోకి తీసుకొనే వాడికంటే, చట్టాలను గౌరవించే వాడు దేశభక్తుడు.
- ❈ మూఢనమ్మకాలను ప్రోత్సహించే వాని కంటే, శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసేవాడు దేశభక్తుడు.

## క్రీస్తు బోధ నిజమైన దేశ భక్తికి నాంది

"నా బైబిల్ నా తోటి మనిషిని ఏ కారణం చేతనైనా ద్వేషించమని చెబుతున్నట్లయితే, నా విశ్వాసాన్ని ఆ క్షణమే త్యజిస్తాను. తాను సృష్టించిన మానవులను తూలనాడే ఏ దేవుడైనా, ఏ మతమైనా విశ్వాసం పేరుతో హింసిస్తే అది ఆధ్యాత్మికతే కాదు, ఆయన దేవుడే కాదు. అటువంటి గ్రంథాలను నేనే కాల్చేస్తా" అంటాడు ఒక రిఫార్మిస్ట్ వేదాంతి. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులు. మాటల్లో 'మానవ సేవయే మాధవ సేవ' అని ఊకదంపుడు ప్రసంగాలిచ్చేవారు తోటి మానవుల శ్రేయస్సు కంటే ప్రకృతి ప్రతి రూపాలకో, జంతు సంరక్షణకో ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా, వాటి కోసం తన దేశ ప్రజలను సహితం హింసించడానికి, ప్రాణాలను తీయడానికి కూడా వెనుకాడడం లేదంటే అట్టి దేశభక్తి నిజమైనదేనా?

క్రైస్తవుని దేశభక్తి పొరుగువారిని ప్రేమించడంతో ప్రారంభమవుతుంది (మత్తయి 22:37-39). మనల్ని మనం ఇతరులకన్నా ఎక్కువగా ఎంచుకోవడం తప్పు అని కొత్త నిబంధన మనకు బోధిస్తుంది (ఫిలిప్పీ 2:3). క్రైస్తవుడు లేమితో ఉన్న తన సహోదరునికి సహాయం చేయడమే గాక అవసరమైతే ప్రాణాన్ని

సహితం పెట్టబద్ధుడై ఉన్నాడు. క్రైస్తవుడు తన దేశాన్ని ప్రేమిస్తాడు, అంతకంటే ఎక్కువగా క్రీస్తును ప్రేమిస్తాడు. దైవభక్తిగల నాయకులు దేశభక్తి గలవారై ఉండాలని బైబిల్ బోధిస్తుంది. క్రైస్తవుని పౌరసత్వం పరలోకానికి సంబంధించినదే అయినా (1 పేతురు 2:9-12) అది ఈలోక బాధ్యతలను తిరస్కరించదు. క్రైస్తవుడు భారత దేశాన్ని క్రైస్తవ జాతిగా సృష్టించాలని ప్రయత్నించదు. నిజానికి క్రైస్తవ్యానికి జాతి లేదు. అది క్రీస్తు జీవన విధానం. క్రైస్తవుడు భారతదేశాన్ని ప్రేమించడం కంటే భారతీయులను ప్రేమించడం చాలా ముఖ్యమని నమ్ముతాడు. థామస్ జెఫెర్సన్ చెప్పినట్లు "దేవుడు నీతిమంతుడని నేను ఆలోచించిన ప్రతిసారి నేను నా దేశం కోసం వణుకుతూ నన్ను నేను పునరంకితం చేసుకొంటాను"

## క్రైస్తవుని కర్తవ్యం

జాత్యహంకారంతో విర్ర వీగడానికి, ప్రపంచంలోని అత్యుత్తమమైన వాటిలో భారతదేశం అగ్రస్థానంలో ఉండాలని కోరుకోవడానికి మధ్య చిన్న తేడా ఉంది. మొదటిది పాపం. రెండవది క్రైస్తవుని ఆశ. రెండవ దాని కోసం జీవితంలో చేసే ప్రతి ప్రయత్నంలో దేవుని వాక్యానికి లోబడుతూ, పరిశుద్ధాత్మ శక్తి ద్వారా మన చుట్టూ ఉన్న సంస్కృతి/ప్రభుత్వంలో బైబిల్ విలువలను చొప్పించడానికి మీరు చేయగలిగినదంతా చేయాలి.

- ❈ పౌరులుగా మరియు క్రైస్తవులుగా, మనం ఇతర జాతీయుల పట్ల అయిష్టతను, భయాన్ని త్యజించాలి.
- ❈ దేవుని సృష్టియొక్క అన్ని రూపాల్లోని స్త్రీ, పురుష, సామాజిక, సాంస్కృతిక, మత మరియు రాజకీయ వైవిధ్యం పట్ల గౌరవాన్ని పెంపొందించాలి.
- ❈ అన్యాయం ఏ రూపంలో ఉన్నా, అది ఎక్కడ ఉన్నా దాని గురించి పట్టించుకోవాలి, ప్రార్థించాలి.
- ❈ మన స్వదేశీయులు దేశ ద్రోహులు అని ముద్ర వేసిన వారి కొరకు ప్రార్థించాలి.
- ❈ నాయకుల పట్ల అగౌరవంగా మాట్లాడక (రోమా 13:1-7), వారి కోసం ప్రార్థించాలి. (1 తిమో 2: 1-4)
- ❈ మన పిల్లలు దేశచరిత్రను విచక్షణాత్మకంగా నేర్చుకోవాలి. దేశభక్తిని జాతీయవాదంతో కలగాపులగం చేయవద్దు.
- ❈ క్రైస్తవ గుర్తింపును బట్టి నాయకులను ఎన్నుకోకూడదు. బైబిల్ సూత్రాలకు ఓటు వేయండి.
- ❈ కేవలం సువార్తకు మాత్రమే కాక దేశభక్తికి సంబంధించి అన్ని రకాల కార్యక్రమాలలో పాల్గొనాలి.
- ❈ సంఘాలలో, సండేస్కూల్స్‌లో దేశభక్తి గురించి బోధించాలి. కొన్ని కార్యక్రమాలను చేపట్టాలి.

## నీవే దేవుని ఆశ

నేటి ప్రపంచ పరిస్థితి ఎలా ఉంది? అధికారిక అంచనాల ప్రకారమే ప్రపంచంలో ఎందరో అభాగ్యులు ఈ రోజుకీ ఏదో రీతిగా చీకటిశక్తుల పీడనకు గురవుతూనే ఉన్నారు. అనేక వర్ధమాన దేశములలో వెట్టిచాకిరీ చేస్తున్న బాలబాలికలు, కనీస వేతనములు లేని కోట్లాదిమంది పారిశ్రామిక కార్మికులు, వ్యభిచారపు రొంపిలో మగ్గుతున్న దాదాపు కొన్ని కోట్ల మందికి పైగా మహిళలు, అప్పుల ఊబిలో చిక్కుకొని తరతరాలుగా ఆర్థిక స్వేచ్ఛనెరుగని నిమ్నవర్గ ప్రజలు, దారిద్ర్యరేఖకు దిగువన పెరుగుతున్న పేదరికం, నరహంతక మతమౌఢ్యముతో ఛిద్రమైపోతున్న దేశాల ప్రజలు, దేశాల మధ్య సమాధానము లేని స్థితి, ఎల్లలు లేకుండా విస్తరిస్తున్న విగ్రహారాధన, నాస్తికత, త్రాగుబోతుతనం, మాదక ద్రవ్యాలు, దుర్వ్యసనాలు, నేరప్రవృత్తి, అదుపులేని కామాతురత, సినిమా, ఫ్యాషన్స్, ఆకర్షణలు, మానవత్వము మరచిపోయిన ధనాపేక్ష, భోగాపేక్ష, రాజకీయ సామాజిక సంగతులు ఎన్నెన్నో.

సమస్త మానవ రుగ్మతలకు యేసుక్రీస్తు రూపములో దేవుడు పరిష్కారం ఇచ్చాడు. కానీ ఇతరులను అర్థం చేసుకోలేని హృదయం, ప్రార్థనకు ప్రాముఖ్యత ఇవ్వలేని క్రైస్తవులమైన మనం ఇలాంటి పెనుసవాళ్ళకు ఎలా స్పందిస్తాం? దేవుడు మనల్ని ఒక ప్రయోజనం కోసం భారతదేశంలో ఉంచాడనే విషయాన్ని అర్థం చేసుకొని, ఆ ప్రకారం జీవిస్తూ మన దేశానికి దేవుని ఆశీర్వాదాన్ని తెచ్చేవారంగా ఉందాం.

– డా. మేడికొండ సాంబయ్య, పులివెందుల

## భారతదేశ స్వాతంత్ర్యం

# క్రైస్తవ నాయకత్వం

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచాయి. మన క్రైస్తవ సమాజం దేశానికి చేసిన సేవల గురించి చట్టబద్ధంగా గర్వపడడానికి చాలా కారణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి ముందు, తరువాత భారతదేశ జనాభాలో 2.3 శాతంగా ఉన్న క్రైస్తవులు విశిష్టమైన రీతిలో దేశ అభివృద్ధికి దోహదపడ్డారు. భారతదేశ అభివృద్ధి యొక్క ప్రతి రంగంలో, ముఖ్యంగా పేదల అభివృద్ధిలో క్రైస్తవ సంఘం కీలక పాత్ర పోషిస్తోంది. కానీ భారతదేశంలోని సంఘం సురక్షితంగా లేదు. ముఖ్యంగా కొన్ని సంస్థలు క్రైస్తవ సమాజాన్ని దూషిస్తూ, వారిని హింసలకు గురిచేస్తున్నాయి. విద్య, వైద్యం, ఆరోగ్యం మొదలైన సామాజిక రంగాలలో ప్రధాన సహకారం ఉన్నప్పటికీ, ద్వేషపూరిత రాజకీయాలు, దుర్మార్గపు ప్రచారాల కారణంగా క్రైస్తవ సమాజం అభద్రతలో ఉంది. గమనించాల్సిన విషయం ఏంటంటే, సమాజంపై దాడి చేసే వారు భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో, ఆదివాసీలు, దళితుల అభివృద్ధి పోరాటాలలో ముందంజలో లేరు. చరిత్రను గమనిస్తే క్రైస్తవ సమాజం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వ్యక్తులతో జతకట్టడంలో చురుకుగా ఉందని తెలుస్తుంది.

### క్రైస్తవ్యం పాశ్చాత్యం కాదు

క్రైస్తవ మతం పాశ్చాత్య మతం అనేది ఒక ఆధారం లేని ఆరోపణ. యేసుక్రీస్తు జన్మస్థలం ఐరోపాలో కాదు, మధ్యప్రాచ్యంలో ఉంది. భారతదేశాన్ని క్రైస్తవ మతంలోకి మార్చడంలో క్రైస్తవులు బ్రిటిష్ వారితో జతకట్టారనే ఆరోపణలు ఎంతమాత్రం వాస్తవం కాదు. బ్రిటిష్ పాలకులకు విశ్వాసం ఉండవచ్చు కానీ వారు క్రైస్తవులు కాదు. వారి లక్ష్యం మతం మార్చడం కాదు, ప్రపంచవ్యాప్తంగా కాలనీలను సృష్టించడం. వారు మతపరమైన లక్ష్యంతో కాకుండా, ఆర్థిక లక్ష్యంతో వచ్చారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా లేదా భారతీయ క్రైస్తవులు బ్రిటిష్ వారి నుండి ఎలాంటి అనుగ్రహాన్ని పొందలేదు. మొదటి నుండి వలసవాదులు మతాన్ని ప్రోత్సహించడానికి నిరాకరించారు. ఎందుకంటే, మిషనరీ సంస్థలతో జతకడితే తమ ఆర్థిక లక్ష్యం విఫలమవుతుందని వారు ఆందోళన చెందారు. బ్రిటిష్, ఇతర వలసవాదుల ప్రధాన లక్ష్యం మతమార్పిడి అయితే, దేశంలో కేవలం 2.3 శాతం కంటే ఎక్కువ మంది క్రైస్తవులు ఉండాలి.

### స్వాతంత్ర్య ఉద్యమం-మిషనరీలు



బ్రిటిష్ పాలనను పూర్తిగా వ్యతిరేకించిన మొదటి వ్యక్తి, బ్రిటిష్ క్రైస్తవ మతగురువు చార్లెస్ ఫ్రీర్ ఆండ్రూస్ (ఫిబ్రవరి 12, 1871–ఏప్రిల్ 5, 1940). ఈయన చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన ఒక సంఘ కాపరి, మిషనరీ, విద్యావేత్త, సంఘ సంస్కర్త. ఈయన మహాత్మాగాంధీ యొక్క సన్నిహిత మిత్రుడు. గాంధీ పౌర హక్కుల పోరాటానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చేలా గాంధీని ఒప్పించడంలో ఈయన పాత్ర ఎంతో ఉంది. 1906 సం॥ నాటి భారత జాతీయ కాంగ్రెస్ కార్యకలాపాల్లో ఆయన పాలు పంచుకున్నారు, 1913 సం॥ మద్రాసులో పత్తి కార్మికుల సమ్మెను పరిష్కరించడానికి కూడా ఎంతో సహాయం చేశాడు.

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయ స్వాతంత్ర్య ఉద్యమానికి పూర్తి మద్దతునిచ్చిన క్రైస్తవ మిషనరీలు ఉన్నారు. ఈ మిషనరీలలో బాగా తెలిసిన పేర్లు: స్టాన్లీ జోన్స్, జె.సి. విన్స్‌లో, వారియర్ ఎల్విన్, రాల్ఫ్ రిచర్డ్ కీథాన్, ఎర్నెస్ట్ ఫారెస్టర్-పాటన్. స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇచ్చినందుకు కొంతమంది మిషనరీలను భారతదేశం నుండి బహిష్కరించారు.

## ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో క్రైస్తవ నాయకులు

క్రైస్తవ నాయకుల ప్రభావం 1885 నుండి భారత జాతీయ కాంగ్రెస్ యొక్క వివిధ సమావేశాలలో ఎంతో ఉంది. రెవ. కాలిచరన్ బెనర్జీతో పాటు లాహోర్ నుండి జి.సి. నాథ్, మద్రాస్ (ప్రస్తుత చెన్నై) కు చెందిన పీటర్ పాల్ పిళ్ళై, 1888-1891 మధ్య కాంగ్రెస్ యొక్క నాలుగు సమావేశాల్లో భారత క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహించి, ప్రారంభ సంవత్సరాల్లో ప్రముఖ నాయకులుగా వ్యవహరించారు. 1889 సం॥లో, భారతీయ ఉపాధ్యాయులు జాతీయ ఉద్యమాలలో పాల్గొనకుండా నిషేధించబడాలనే తీర్మానాన్ని వారు తీవ్రంగా నిరసించారు. 1887 సం॥లో జరిగిన కాంగ్రెస్ యొక్క మూడవ వార్షిక సమావేశంలో పాల్గొన్న 607 మందిలో, 15 మంది క్రైస్తవులు. అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించిన వారిలో మధు సుధాన్ దాస్ (1848-1934, 'ఉత్కల్ గౌరాబ్' అని పిలుస్తారు), ఈయన ఒడిశా క్రైస్తవ సంఘానికి చెందిన ప్రసిద్ధ నాయకుడు. 1889 సం॥ కాంగ్రెస్‌లోని పది మంది మహిళా ప్రతినిధులలో, ముగ్గురు క్రైస్తవులు: పండిత రామాబాయి సరస్వతి (1858-1922), శ్రీమతి త్రయంబక్, శ్రీమతి నికాంబే ఉన్నారు.

## స్వరాజ్ ఉద్యమంలో క్రైస్తవులు

1930 సం॥లో భారతీయ క్రైస్తవుల ప్రధాన సమావేశం బొంబాయిలో జరిగింది. అక్కడ వారు అనేక తీర్మానాలను ఆమోదించారు. భారతదేశ పూర్తి స్వరాజ్యం కోసం పోరాడాలని వారు తీర్మానించారు. 1931వ సం॥లో, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ కోసం మహాత్మా గాంధీ బయలుదేరిన సందర్భంగా, వారు ఒక మెమోరాండం సమర్పించారు.

1944వ సం॥లో భారతదేశంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ సమావేశంలో, కౌన్సిల్ 'యుద్ధానంతర భారతదేశంలో చర్చ్ అండ్ స్టేట్' పై ఒక ప్రకటనను వెలువరించింది. స్వరాజ్ ఉద్యమం (1905), సహాయ నిరాకరణ ఉద్యమం (1920), శాసనోల్లంఘన ఉద్యమం (1930), 'క్విట్ ఇండియా' ఉద్యమం (1942)లో క్రైస్తవులు చురుకుగా పాల్గొన్నారు. 1920వ సం॥ నుండి, అనేక క్రైస్తవ సంస్థలు స్వాతంత్ర్య ఉద్యమానికి పూర్తి సంఘీభావం వ్యక్తం చేసి కొందరు బ్రిటిష్ వలస ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమాలలో కూడా పాల్గొన్నారు. సంఘాలకు అనుబంధంగా ఉన్న విద్యాసంస్థల విద్యార్థులు స్వరాజ్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

## సామాజిక సంస్కరణలు

భారతదేశంలో కొనసాగుతున్న సతీసహగమనం, అంటరానితనం, కుష్ఠురోగులను చంపడం, పసి బిడ్డలను బలివ్వడం మొదలైన సాంఘిక దురాచారాల పట్ల మొదటి నుండి మిషనరీలు దృష్టి సారించారు. 1793వ సం॥లో విలియం కేరీ భారతదేశానికి వచ్చినప్పటి నుండి శిశుహత్య, సతీసహగమనం, అంటరానితనం సమస్యలపై చురుకుగా పోరాడారు. ఒకవైపు అధికారంలో ఉన్నవారితో, అధికారంలో లేనివారితో తనకున్న సంబంధాలను ఉపయోగించుకుని, అలాంటి పద్ధతులను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని ప్రచారం చేస్తూనే, మరోవైపు మానవతా ఆందోళనకు సంబంధించిన విషయాల పై ప్రజాభిప్రాయాన్ని తెలియజేయడానికి తన ప్రచురణలను ఉపయోగించుకొన్నాడు. 1814 నాటికి రాజా రామ్ మోహన్ రాయ్ సతీసహగమనానికి వ్యతిరేకంగా ప్రచారంలో విలియం కేరీకి తన మద్దతును ఇచ్చాడు. ఆ దినాలలో జరిగిన 438 వితంతువుల దహనానికి సంబంధించిన వివరాలతో పోరాటానికి సన్నద్ధమయ్యారు. కేరీ, అతని సెరంపూర్ సహచరులు ఈ ఆచారాన్ని చట్టం ద్వారా నిషేధించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సంపన్న వర్గాల హిందూ నాయకుల నుండి తీవ్ర వ్యతిరేకత కారణంగా మొదట్లో చాలా తక్కువ పురోగతి సాధించినప్పటికీ, చివరికి ప్రజాభిప్రాయం సనాతన హిందువులకు వ్యతిరేకంగా మారింది. 1829 సం॥లో లార్డ్ విలియం బెంటింగ్ చివరకు ఈస్ట్ ఇండియా కంపెనీ సతిని నిషేధిస్తూ ఒక ఉత్తర్వుపై సంతకం చేశాడు.

మానసిక, శారీరక వికలాంగుల కోసం చర్చ్ సంస్థలను ఏర్పాటు చేసింది. క్యాథలిక్, ప్రొటెస్టెంట్ క్రైస్తవులు భారతదేశం అంతటా వదిలివేయబడిన, దుర్వినియోగం చేయబడిన, దోపిడీకి గురైన వారి కోసం అనేక గృహాలను స్థాపించారు. బాల్య వివాహాల ఆచారానికి వ్యతిరేకంగా క్రైస్తవ సంఘం పోరాడింది. 1929 సం॥లో బాల్య వివాహాలపై నిషేధం విధించిన తర్వాత, చర్చ్ వితంతు పునర్వివాహానికి ఆమోదం తెలిపేందుకు గట్టి ప్రయత్నం చేసింది. దీనికి పరి

ష్కారమైన స్త్రీ విద్యను ప్రోత్సహించింది. క్రైస్తవ సంస్కరణలలో భాగంగా క్షయ రోగులకు, కుష్టు వ్యాధి సోకిన వారి కోసం శానిటోరియాలను ఏర్పాటు చేయడం జరిగింది.

### గ్రామీణాభివృద్ధి

క్రైస్తవ సంఘం ముఖ్యమైనదిగా భావించే మరొక అంశం గ్రామీణాభివృద్ధి. అలహాబాద్ (అలహాబాద్ వ్యవసాయ కళాశాల), తమిళనాడులోని సేలం సమీపంలో రెండు వ్యవసాయ కళాశాలల స్థాపనతో "గ్రామీణ పునర్నిర్మాణం" కోసం ప్రయత్నాలు జరిగాయి. బాసెల్ మిషన్, మంగుళూరులోని తన ప్రధాన కార్యాలయం నుండి పనిని ప్రారంభించింది, గ్రామ గృహ నిర్మాణాన్ని మెరుగుపరచడానికి చౌకైన టెర్రకోట టైల్స్, ఇతర సంబంధిత ఉత్పత్తుల తయారీని భారతదేశానికి పరిచయం చేయడంలో ప్రసిద్ధి చెందింది. ఇటువంటి పలకలు ఇప్పటికీ ప్రసిద్ధిలో ఉన్నాయి. వాటిని ఎవరు ఉత్పత్తి చేసినా, మిషన్ టైల్స్‌గా పిలుస్తారు.

క్రైస్తవ సంఘం ప్రభావాన్ని చూపిన మరొక అంశం స్త్రీ విద్య. ఈ పనిలో ఎక్కువ భాగం ప్రారంభ మిషనరీల భార్యలు, ఒంటరి మహిళా మిషనరీస్‌తో నిర్వహించబడింది. అనేక గ్రామాలలో అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి కల్పించడంలో క్రైస్తవులు మొట్టమొదట ఉన్నారు.

### ఆధునిక విద్యకు మూలకర్తలు

భారతదేశానికి క్రైస్తవ సంఘం అందించిన ఇతర ప్రధాన సహకారం ఏంటంటే, స్వాతంత్ర్యానికి ముందు, తరువాత యువతీ యువకులు ఆధునిక విద్యను పొందారు. నేటికీ క్రిస్టియన్ కళాశాలలు దేశంలోని అత్యుత్తమ ర్యాంక్‌లను కలిగి నాణ్యమైన విద్యకు ప్రసిద్ధి చెందాయి. భారతదేశంలోని అనేక తరాల క్రైస్తవేతర, క్రైస్తవ ఉన్నతవర్గాలు, సామాన్యులకు విద్యనందించాయి. కొన్ని మతవాద సంస్థలు ఆరోపించినట్లుగా, ఈ సంస్థలు చేసే మత మార్పిడుల గురించి వ్యవస్థలోని వారికి ఎటువంటి ఫిర్యాదులు లేవు. పాఠశాలలకు తోడుగా ప్రింటింగ్ ప్రెస్‌లు వచ్చాయి, ఇవి అన్ని రకాల సాహిత్య వ్యాప్తికి సహాయపడుతున్నాయి. పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, వ్యాకరణాల తయారీకి, విద్యాభివృద్ధికి అత్యుత్తమ కృషి చేసినందుకు భారతదేశం మిషనరీస్‌కు రుణపడి ఉంది.

### ఆరోగ్య సంరక్షణ

క్రైస్తవులు భారతదేశం యొక్క ఆరోగ్య సంక్షేమం, వైద్య రంగంలో గణనీయమైన సహకారాన్ని అందించారు. 19వ శతాబ్దంలో వివిధ రకాల వైద్య సంస్థలు భారతదేశం అంతటా స్థాపించబడ్డాయి. వీటిని దాదాపుగా మిషనరీ సంస్థలే ఏర్పాటు చేశాయి. వీటిలో రెండు అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి. మొదటిది, 1893 సం॥లో డాక్టర్ ఎడిత్ బ్రౌన్ చేత స్థాపించబడిన లూధియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్. మరొకటి, క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ హాస్పిటల్ వెల్లూర్, డాక్టర్ ఇడా స్కడ్డర్ యొక్క రోడ్‌సైడ్ క్లినిక్‌ల నుండి 1895 లో ప్రారంభమైంది. ఈ రెండు ఆసుపత్రులు మొదట మహిళలకు, తరువాత పురుషుల కోసం ఏర్పాటు చేయబడ్డాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన మొదటి వైద్య కళాశాలలుగా పేరుపొందాయి. చర్చ్-అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రుల ద్వారా లక్షలాది మంది వైద్య సేవల్ని పొందారు.

గ్రామాల స్థాయిలో, అనారోగ్యాన్ని, బాధలను నయం చేయడానికి అనేక మారుమూల ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కేంద్రాలతో చర్చి పనిచేసింది. నేటికి కూడా దేశం యొక్క మారుమూల ప్రాంతాల్లో క్రైస్తవ సంస్థలు వైద్య పరిచర్యను కొనసాగిస్తున్నాయి.

### గిరిజనులు

ఈశాన్య భారతదేశంలోని గిరిజనులు ఈనాడు ఒక గౌరవాన్ని, గుర్తింపును సంపాదించడానికి మూల కారణం అక్కడ క్రైస్తవ మిషనరీలు చేసిన పరిచర్య. జార్ఖండ్‌లో గిరిజనులు చర్చ్ యొక్క కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలియజేస్తారు. ఈ ప్రాంతాలలో చర్చ్ యొక్క సంస్థలలో విద్యాభ్యాసం చేసి, జాతీయ నేతలుగా ఎదిగిన దళిత నాయకులు ఎందరో ఉన్నారు.

### ముగింపు

క్రైస్తవ సమాజం చాలా తక్కువగా ఉన్నప్పటికీ, హేతుబద్ధత, మానవతావాద దృక్పథంతో "నిజమైన ఆధునిక భారతీయులను" సృష్టించడంలో ఆనాటి క్రైస్తవ సంఘం ముఖ్యమైన పాత్రను పోషించింది. అదే వారసత్వాన్ని ఇప్పటి క్రైస్తవులు ఎలాంటి లోపం లేకుండా కొనసాగించాలి.

– **రూత్ వినయ్,** ప్రగతినగర్, హైదరాబాద్





# క్రైస్తవ్యం విదేశీ మతమా?

క్రైస్తవ్యం అంటే క్రీస్తు. తాను సత్యమై ఉన్నానని ఆయన తనను గూర్చి తాను చెప్పుకొన్నాడు. "నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు". సత్యము విషయంలో విదేశీ, స్వదేశీ అను తేడాలు ఉండవు. అనేక దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు అనేక సత్యాల ను కనుగొన్నారు. ఇది మా రష్యా సత్యము అని ఒకరు, ఇది మా అమెరికా సత్యము అని మరొకరు, ఇది మా భారతదేశ సత్యము అని ఇంకొకరు చెప్పుకోలేదు. సత్యము ఎప్పుడూ విశ్వజనీయమైనది, సర్వమానవాళికి సంబంధించినది. న్యూటన్ ప్రతిపాదించిన గమన సూత్రము ఇంగ్లాండులో ఎంత సత్యమో, భారతదేశంలో కూడా అంతే సత్యము. కాబట్టి, దేవుడు మానవాళి విమోచన కోసం ఒక రక్షకుని, ఒక రక్షణ మార్గాన్ని ఏర్పాటు చేసినప్పుడు అవి ప్రతి దేశానికి అవసరము.

ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే దేవుని సంపూర్ణ ప్రణాళిక ప్రకారం యేసుక్రీస్తు అన్ని దేశాల వారికి "విదేశీయుడే". పాలస్తీనా అను ఒక చిన్న దేశ పౌరుడు యేసుక్రీస్తు. ఆ దేశ పౌరునిగా ఆయన అధికారికంగా లెక్కించబడ్డాడు. తన స్వంత ప్రజలచేత సిలువ వేయబడ్డాడు. క్రైస్తవ్యం ప్రారంభమైన సంవత్సరం నుండి 1900 సం॥ల వరకు పాలస్తీనా దేశం ఒక దేశంగా లేదు. క్రైస్తవ మతానికి స్వంత జనులు ఎవరంటే యూదులే. ఈ యూదులకు ఒక దేశమంటూ ఏదీ లేకుండా పోయింది. వారు అనేక దేశాలలో చెదరిపోయి ఉన్నారు. ఈ యూదులకు యేసుక్రీస్తు అన్న పదమంటేనే గిట్టేది కాదు. ఇప్పుడు యూదులకు ఒక స్వంత దేశం ఏర్పడింది. క్రీస్తు, క్రైస్తవ్యం తమ స్వంత దేశంలోనే ఉద్భవించాయి అని చెబుతుంటారు, కాని వారు తమ స్వంత క్రీస్తును తృణీకరిస్తున్నారు.

బైబిల్‌లోని సంస్కృతి, సాంప్రదాయాలు భారతదేశం వంటి తూర్పుదేశాల సంస్కృతి, సాంప్రదాయలకు దగ్గరగా ఉంటాయి. కాని పాశ్చాత్య దేశాలైన బ్రిటన్, అమెరికాలకు బైబిల్‌లోని సంస్కృతులు చాలా కొత్తగా ఉంటాయి. ప్రస్తుతకాలం నాటి ఒక అమెరికన్ జాతీయుడు బైబిల్‌లోని సంస్కృతి సాంప్రదాయాలను అర్థం చేసుకోవాలంటే అనేక బైబిల్ వ్యాఖ్యానాలు చదవాల్సి ఉంటుంది. కానీ యేసుక్రీస్తు బోధలను అర్థం చేసుకోవడం, వాటిని పాటించడం ఒక భారతీయునికి చాలా సులభంగా ఉంటుంది. బైబిల్‌లోని కొన్ని పుస్తకాలకు వాఖ్యానాల ను భారతీయులు రాసేంత వరకు, ఆ పుస్తకాలు అస్సలు అర్థంకావని చెప్తుంటారు.

గత రెండు శతాబ్దాల నుండి క్రైస్తవ్యాన్ని పాశ్చాత్య మిషనరీలు బోధించారు అన్నది వాస్తవమే. వారిలో కొందరు బ్రిటన్ లేదా అమెరికా దేశ దుస్తుల్లో క్రీస్తును ప్రకటించి పొరపాటు చేశారు. మరికొందరు (వీరిలో రచయితకు వ్యక్తిగతంగా తెలుసు) క్రీస్తును వ్యక్తిగతంగా తెలుసుకోకుండా భారతదేశానికి మిషనరీలుగా వచ్చి, ఇక్కడ ఆ అనుభవాన్ని పొందారు. మిషనరీలు బైబిల్ ప్రకారమే బోధించారు. భారతీయ సంఘాలపై ఆధిపత్యము చేయలేదు. విదేశీ మిషనరీలు, టెక్నీషియన్లు భారతదేశానికి రావడం ఇప్పుడు కొత్తేమీ కాదు. వీరు భారతదేశంలో తాత్కాలికంగానే ఉన్నారు; ఇక్కడ ఒప్పుకోవాల్సిన విషయం ఏంటంటే, భారతీయ విదేశీ పరిశ్రమ ఎప్పుడో పతనమైంది. భారతీయ క్రైస్తవ సంఘం పతనం కూడా ఎప్పుడో ప్రారంభమైంది. బ్రిటన్‌లోకి క్రీస్తు సువార్త రాకపూర్వమే అది భారతదేశానికి వచ్చింది. క్రైస్తవ్యం అమెరికా దేశానికి వెళ్ళకపూర్వమే భారతదేశంలో దాని పతనం ప్రారంభమైంది.

ముస్లింలు భారతదేశంపై దాడిచేయక మునుపు క్రైస్తవ సంఘము భారతదేశంలో చాలా ప్రదేశాలకు వ్యాపించిందని చరిత్రలో బలమైన ఆధారాలున్నాయి. బైబిల్‌ను భారతీయ భాషల్లోకి అనువదించకపోవడమే ఘోర తప్పిదమైంది. ఫలితంగా క్రైస్తవ్యం వృద్ధి చెందకపోగా, పతనంవైపుకు ప్రయాణించింది. బైబిల్ కోసం ఆకలిగొన్న ఉత్తరాది క్రైస్తవులు తర్వాత కాలంలో వేగంగా ఇస్లాంవైపు మొగ్గుచూపారు. కారణం ఏంటంటే తమ క్రైస్తవ విశ్వాసానికి ఇస్లాం మతానికి దగ్గర పోలికలు ఉన్నట్లు వారు గుర్తించారు. అలాగే దక్షిణ భారతదేశంలో తమిళ క్రైస్తవులు తొమ్మిదో శతాబ్దంలో మణిఖ్ఖవచ్చకార్ ఆధ్వర్యంలో హిందూ మతంలోనికి తిరిగివెళ్ళారు (see P. Thomas, "Christians and Christianity in India and Pakistan", London: George Allen and Unwin, 1954, pp. 209, 210). కేరళలో మిగిలి ఉన్న క్రైస్తవులతో జతకలిసి క్రైస్తవ్యాన్ని భారతదేశంలో తిరిగి బ్రతికించడానికి దేవుడు కొంతమంది పాశ్చాత్య మిషనరీలను ఇక్కడకు పంపించాడు.

నేను ఇంతకుముందే చెప్పినవిధంగా, సత్యం ఏ దేశం నుండి వస్తుందో అది ఆ దేశానిదే అని చెప్పడం సమంజసం కాదు. సత్యం ఒక దేశానికే పరిమితమవ్వదు. మనం భారతదేశ చరిత్రలోనికి వెళ్తే బ్రాహ్మణిజం కూడా తొలి ఆర్యులు (ఇండో-యూరోపియన్) రాక ద్వారానే క్రీ.పూ. 1500-2000 సం॥ల మధ్యకాలంలో భారతదేశానికి వచ్చింది. వీరికన్నా ఇంకా ముందు ద్రవిడులు భారతదేశానికి వచ్చి, సింధూ నాగరికతను స్థాపించారు. వీరు దక్షిణ మధ్యధరా సముద్ర ప్రాంతానికి చెందినవారుగా చెప్తుంటారు. ద్రవిడులు కన్నా ముందు భారతదేశంలో మంగోలులు జీవించారు, వీరి సంతానమే ఇప్పుడు అస్సాం పర్వత ప్రాంతాల్లో ఉన్నారు. ఇంకా వీరికన్నా ముందు తూర్పు మధ్యధరా సముద్ర ప్రాంతానికి చెందిన నెగ్రిటో జాతి ప్రజలు భారతదేశానికి వచ్చారు. దేశాల ఆవిర్భావానికి సంబంధించిన సిద్ధాంతాలు ఎన్ని రకాలుగా ఉన్నప్పటికీ, ఒక్క విషయం మాత్రం స్పష్టంగా చెప్పగలము. అదేమిటంటే భారతదేశ ప్రజలందరూ "విదేశీయులే". కాబట్టి ఒక మతాన్ని 'విదేశీ' కోణంలో చూడడం హాస్యాస్పదంగా ఉంటుంది. నిజమైన, సత్యమైన మతం విశ్వజనీయమైనది. అది స్థానిక ప్రజలకు తెలియని ఆత్మీయ సత్యాలను తెలియజేస్తున్న కారణంగా అది వారికి 'విదేశీ' మతంగానే ఉంటుంది.

చివరిగా, "క్రైస్తవ్యం ఒక విదేశీ మతమా?" అను ప్రశ్న చాలామంది భారతీయుల్లో భయాన్ని పుట్టిస్తుంది. అది సత్యమైనప్పటికీ, పరాయి మతాన్ని అవలంభించడం ద్వారా తమ సనాతన సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగౌతాయోమోనన్నదే భారతీయుల భయం. ఒక మతం ఆ దేశంలోని వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా సంస్థలతో మమేకమవుట ద్వారా సంస్కృతి ఉద్భవిస్తుంది. భారతదేశంలో పారిశ్రామికీకరణ మూలంగా, భారతదేశ సంస్కృతిలో పెనుమార్పులు రావడం సహజమే.

మనం భారతీయ సంస్కృతిని క్షుణ్ణంగా పరిశీలిస్తే, క్రొత్త నిబంధనలోని క్రైస్తవ విలువలకు అది చాలా దగ్గరగా ఉంటుంది. ఆతిథ్యం, కుటుంబ జీవనం, తల్లిదండ్రులను గౌరవించడం, స్త్రీలను గౌరవించడం, భార్య భర్తకు లోబడి ఉండడం, వస్త్రధారణ, ఆహారపు అలవాట్లు, సాధారణ జీవనశైలి, అహింస, దానధర్మాలు, అన్నిటికన్నా ముఖ్యంగా ఆత్మీయతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అనేక విషయాలలో భారతీయ సంస్కృతికి, క్రొత్త నిబంధనకు దగ్గర పోలికలు ఉన్నాయి.

కులతత్వం, తక్కువజాతి వారిని హీనంగా చూడడం, మానవాళి కష్టాలను పట్టించుకోకపోవడం, విగ్రహారాధన వంటి భారతీయ సంస్కృతిలోని విషయాలను భారతీయ క్రైస్తవులు ఖచ్చితంగా విడనాడాలి. ఇది నిజమైన భారతీయ సంస్కృతి నుండి వచ్చినవి కావు. విశాల హృదయంతో ఆలోచించే ఏ ఒక్క భారతీయుడు కూడా వీటిని తిరస్కరించకుండా ఉండలేదు. నిజమైన భారతీయ సంస్కృతిని కాపాడగలిగే ఏకైక వ్యక్తి క్రీస్తేనని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

– రాబర్ట్ బ్రో

**Source:** http://campuslinklive.org/christianity-a-foreign-religion/#sthash.SsVjxUop.dpuf

# పండిత రమాబాయి

## స్వదేశీ మిషనరీ




పండిత రమాబాయిగా ప్రసిద్ధి చెందిన ఈ బాలిక దక్షిణ భారత దేశం కర్నాటక రాష్ట్రంలో కనరా అనే ప్రాంతంలో 1858 ఏప్రిల్ 23న నిష్టాగరిష్ఠులైన బ్రాహ్మణ కుటుంబంలో అందరిలో చిన్నదిగా జన్మించింది. ఈమె ఆరు నెలల పసికందుగా ఉన్నప్పుడు తల్లిదండ్రులు బిడ్డనొక గంపలో పెట్టుకొని పుణ్యక్షేత్రాల్ని దర్శించడం ప్రారంభించారు. పుణ్య తీర్థాల్లో స్నానమాడి, దేవాలయాల్ని దర్శిస్తూ యాత్రికుల కొరకు బహిరంగ స్థలాల్లో సంస్కృత పురాణాలను చదువుతూ ఒక్కొక్క చోట కొన్ని నెలలు ఉండేవారు. దైవభక్తిగల హిందూ యాత్రికులు పురాణాల్ని విన్నాక, తమకు తోచిన సహాయం చేసేవారు. ఆ రీతిగా ఆ కుటుంబం జీవిస్తూ ఉండేది.

### క్షామం

రమాబాయి వారి కుటుంబం నివసిస్తున్న ప్రాంతంలో క్షామం ప్రబలి పోయింది. తండ్రి చిక్కి శల్యమై మరణావస్థలో ఉండగా, అందరూ ఒక దేవాలయంలో చేరారు. కాని, అక్కడున్న పూజారులు వారిని తరిమేశారు. తర్వాత గ్రామం వెలుపల ఉన్న పాడుబడిన దేవాలయంలో తలదాచుకొని అక్కడే వారి తండ్రి మరణించాడు. ఆకలి బాధతో వరుసగా తల్లి, సోదరి కూడా మరణించారు.

### కలకత్తా

తమ కుటుంబంలో అందరూ మరణించగా అన్న, చెల్లెలు మిగిలారు, పెద్ద దిక్కంటూ లేక, డబ్బు సంపాదించే శక్తి లేక, జీవితాన్ని ఎదుర్కొనవలసిన ఆ బిడ్డలకు జీవితం పోరాటమే! చలి బాధకు తాళలేక నదీ తీరాల్లోని ఇసుకలో పడుకొంటూ, తరచుగా ఉపవాసాలతో పుణ్యక్షేత్రాల్ని దర్శిస్తూ నిరంతరం పయనిస్తూ వీరు కలకత్తా చేరారు. కొన్నాళ్ళకు అక్కడే విద్యావేత్తలైన బ్రాహ్మణులతో పరిచయం ఏర్పడింది. రమాబాయి పురాణాల్లో పాండిత్యాన్ని, వాదనా శక్తిని పెంపొందించుకొంది. ఆమె తెలివి తేటలను మెచ్చిన పండితులామెకు 'పండిత' అనే బిరుదు ప్రధానం చేశారు. ఇక్కడ వారి భుక్తికి లోటు లేకుండా గడిచి పోయేది. స్త్రీల దుస్థితిని పరిశీలించిన పండిత రమాబాయి, స్త్రీల దుస్థితిని పోగొట్టడానికి వారిని విద్యావంతులుగా చేయాలని, స్త్రీ జనోద్ధరణ తన ప్రథమ కర్తవ్యమని ధైర్యంగా బహిరంగ సభల్లో ఉపన్యసించేది. కలకత్తాలోనే ఆమెకు క్రైస్తవులతో పరిచయం ఏర్పడింది. వారి ఆచార వ్యవహారాలు, ప్రవర్తన ఆమెలో ఆసక్తిని కలిగించాయి. సంస్కృతంలో బైబిలు ఆమెకెవరో ఇచ్చారు. అందులోని విషయాలు అర్థం కానందున ఆమె దానిని చదవకుండా దాచి పెట్టుకొంది. హిందూ మత గ్రంథాల్ని, పురాణాల్ని తరచి చదివి స్త్రీలకు ఎలాంటి ఆధ్యాత్మిక విమోచన కనుగొనలేక నిరాశ చెందింది. దేవుని కొరకైన వెదుకులాటలో నిజ దేవుడెవరో తెలిసికోలేక తన పితృ పారంపర్య దేవతారాధనను మానివేసింది. ఇరవై రెండేళ్ళ వయసులో బెంగాలీ శూద్ర యువకుణ్ణి వివాహమాడింది.

### దైవాన్వేషణ

భర్తతో కలసి అస్సాంలో నివసిస్తున్న సమయంలో ఆమెకు బెంగాలీ భాషలో ముద్రించబడిన లూకా సువార్త లభించింది. దానిని ఎంతో ఆసక్తితో ఆమె చదువుతున్న సమయంలోనే ఒక క్రైస్తవ మిషనరీ ఆమెను క్రమంగా దర్శిస్తూ బైబిల్లోని కథల అంతరార్థాన్ని వివరిస్తుండేది. క్రైస్తవ్యం పట్ల రమాబాయి చూపుతున్న ఆదరణ భర్తకు నచ్చలేదు. పరిస్థితి తీవ్రరూపం దాల్చక ముందే కలరా వ్యాధితో ఆమె భర్త మరణించాడు. వివాహమైన రెండేళ్ళకే

భర్త మరణించడంతో పాతిక సంవత్సరాలు నిండక ముందే రమాబాయికి వైధవ్యం ప్రాప్తించింది.

భర్త మరణానంతరం కుమార్తె మనోరమతో కలిసి ఆమె పూనా వెళ్ళింది. అక్కడున్న క్రైస్తవ మిషనరీ ద్వారా క్రీస్తు ప్రభువును గురించి వింటూ ఉండేది.

భారతదేశపు స్త్రీల అభ్యున్నతి కొరకేదో చేయాలనే పట్టుదలతో పండిత రమాబాయి మొదట తను తగిన విద్యార్హతల్ని సంపాదించుకొని శిక్షణ పొందాలని ఆశించి ఆమె 1883వ సంవత్సరం కుమార్తెతో కలిసి ఇంగ్లాండ్ వెళ్ళింది. అక్కడ చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు చెందిన సోదరీల పరిచయం వలన క్రైస్తవ్యాన్ని గురించి మరెన్నో విషయాలు తెలుసుకొంది. వారు వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సంక్షేమ కార్యక్రమాల్ని, అక్కడ ఉంటున్న పతితలు, దౌర్భాగ్యులైన స్త్రీల జీవితాభ్యున్నతి కొరకెంతో త్యాగ నిరతితో చేయబడుతున్న సేవ ఆమెనెంతో ఆకట్టుకొన్నాయి. క్రీస్తును కలిగిన వారి జీవితాల్లోని మార్పు చూసిన ఆమె భారతదేశపు స్త్రీల దీనావస్థను క్రీస్తు ప్రభువే మార్చగలడని నిర్ధారించుకొన్నది.

ఏ ప్రభువు గురించి ఇంతకాలం వింటున్నదో ఆ ప్రభువు అడుగు జాడల్లో నడవాలని నిశ్చయించుకొని చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ సంఘంలో బాప్తీస్మం తీసుకొంది. క్రీస్తును సంపూర్ణంగా ఎరుగక, రక్షణానందం, అనుభవం లేనందున తన ఈ నూతన జీవితంలో వెలితిననుభవిస్తూనే ఉంది. ఇంగ్లాండ్ నుండి అమెరికా వెళ్లి అనేక సభల్లో పాల్గొని తిరిగి భారతదేశం చేరుకున్నదామె. ఆ సమయంలో తన ఆత్మీయానుభవం గురించి చెబుతూ "క్రైస్తవ మతాన్ని ఎరిగాను గాని, ఆ మతానికి జీవనాడియైన క్రీస్తును నేనెరుగలేదని" తెలిపింది. తన ఆత్మీయ జీవితపు అసంతృప్తిని తొలగించుకోవడానికి శ్రద్ధగా బైబిల్ చదవడం ప్రారంభించింది. పరిశుద్ధాత్మ కృపవలన దైవ వాక్యం ద్వారా క్రీస్తు ప్రభువును తన స్వరక్షకునిగా అంగీకరించి రక్షణానుభవం పొందింది.

## శారదా సదన్

క్రీస్తు ప్రభువు నెరిగిన రమాబాయి ఆయనను సేవించగోరినది. ప్రతి అవసరం నిమిత్తం ప్రభువు పైన ఆధారపడి విశ్వాసమే పునాదిగా దేవుని సేవ చేయాలని ప్రేరేపించబడింది. ఆనాటి భారతదేశపు బాల వితంతువుల, బాలికల పాపభూయిష్టమైన హీన జీవిత స్థితిగతులను మార్చి, వారి అభ్యున్నతి కొరకేదైనా చేపట్టాలనే ఆశతో, పూనాలో శరణాలయాన్ని ప్రారంభించింది. సమాజంచే వెలివేయబడి, తృణీకరింపబడిన దీన దరిద్ర స్త్రీలందరిని తన శరణాలయంలో చేర్చుకొనేది.

ఎద్దుల బండిలో పరిసర గ్రామాలకు వెళ్లి వారికి క్రీస్తు రక్షణ సందేశాన్ని బోధించటమే గాక, పేద ప్రజలకు ఆహారాన్ని, దుస్తుల్ని పంపేది. హిందూ దేవాలయాల్లోని దేవదాసీలను విడిపించి, ఆశ్రయమిస్తున్న కారణంగా పూజారులామెను వ్యతిరేకించేవారు. ఆమె చేసే సేవ క్రమేణా భారతదేశంలోను, విదేశాల్లోను ప్రాచుర్యం పొందినది. సరోజినీ నాయుడులాంటి దేశ నాయకులామెను భారతీయ స్త్రీలలో పేరు గాంచినదిగా శ్లాఘించారు.

## ముక్తి

రమాబాయి చేస్తున్న సేవ విస్తరించినందున, శరణాలయంలో స్థలం చాలనందున పూనా సమీపంలోనున్న ఖేద్రా గాం వద్ద మరొక భవనంను ఎంతో ప్రార్థనా పూర్వకంగా నిర్మించి దానికి విమోచన అనే అర్థమిచ్చు 'ముక్తి' అని పేరు పెట్టింది. ముక్తిలో శిక్షణ పొందిన స్త్రీలెందరో బైబిల్ టీచర్స్‌గా, నేత, తోటపనుల్లో నిపుణురాళ్ళుగా, గృహిణులుగా సమాజంలో గౌరవనీయ జీవితం గడుపుతున్నారు.

## ధన్యురాలు

తాను ప్రారంభించిన శరణాలయాల్లో రెండువేల మందికి పైగా బాలికలు, స్త్రీలు, వారి నిర్వహణకై నూరుమందికి పైగా ఉన్న సేవికలతో, ఆ సంస్థలెంతో అభివృద్ధి చెందాయి. 1922వ సంవత్సరం తన జీవిత యాత్రను ముగించిన ఆమెను భళా! నమ్మకమైన దాసురాలా అని ప్రభువే తన సన్నిధికి చేర్చుకొని ఉంటాడనడంలో సందేహంలేదు. ఆమె మరాఠి భాషలో రాసిన క్రైస్తవ భక్తి గీతాలు ఈనాటికీ వాడుకలోనున్నాయి. ఆమె స్థాపించిన ముక్తిసంస్థ నిరాశ్రయులై, పతితలుగా ముద్ర వేయబడిన అభాగ్యులకెందరికో ఆశ్రయమిచ్చి ప్రయోజనకరమైన జీవితాల నేర్పరచుకొనేందుకు దోహదం చేస్తుంది.

"నీకున్నదొకే జీవితం అదైనా క్షణికం,
క్రీస్తు కొరకేమి చేశావో అదే శాశ్వతం!"

– కత్తి ఎర్రి స్వామి, రైల్వే కోడూరు



# మన కుటుంబాల ద్వారా ఆశీర్వాదమా? శాపమా?

ఒక స్కూల్లో ఒక విద్యార్థి స్కూల్ నుంచి పెన్సిల్ దొంగతనం చేయడం ఆరంభించాడు. ఆ స్కూల్ ప్రిన్సిపల్ తండ్రిని పిలిపించి ఈ విషయం అతనికి వివరించాడు. తండ్రి కొడుకు వైపు కోపంతో చూసి ఆ పెన్సిల్స్ నువ్వెందుకు దొంగతనం చేసావ్. అలా దొంగతనం చేయకూడదు కదా అని అడిగాడు. దానికి కొడుకు నా పెన్సిల్స్ అన్నీ అయిపోయాయి అని తండ్రికి చెబితే, ఆ తండ్రి "నువ్వు నాకెందుకు చెప్పలేదు, చెబితే నేను ఆఫీస్ నుంచి తెచ్చేవాడిని గదా! వాటిని ఎప్పుడుకావాలంటే అప్పుడు వాడుకోవచ్చు" అన్నాడు. అటువంటి ఆదర్శాన్ని తన కొడుకుకు అందిస్తే భవిష్యత్‌లో తనెటువంటి నాయకుడు అవుతాడు.

## కుటుంబం ప్రాముఖ్యత

"క్రైస్తవ కుటుంబం ఒక మిషనరీ పని లాంటిది. అది ప్రపంచానికి  దేవుని ప్రేమను ప్రకటిస్తుంది" అని అంటాడు పోప్ ఫ్రాన్సిస్.

దేవుడు ఆయన సృష్టిలో కుటుంబ వ్యవస్థను మొట్టమొదటిగా చేయడానికి కారణం ఆ కుటుంబం ద్వారా భూమి, దానిపై జీవించే ప్రజలు ఆశీర్వాదాన్ని పొందాలని ప్రణాళిక వేశాడు. ఆది కుటుంబం అవిధేయతతో దానిని చెరిపినప్పటికి, అబ్రాహాముకు ఇచ్చిన నిబంధనలో మళ్ళీ పునరావృతం చేశాడు. "నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు." ఇది నెరవేరడానికి అవసరమైన ప్రతి నియమాన్ని ఆరంభంలోనే స్పష్టంగా ఇచ్చాడు (ఆది 2 :18-25). అవి అతిక్రమిస్తే అనుభవించే పర్యవసానాలు వివరించాడు.

నేను ఉపదేశించిన విధులు, కట్టడలను పాటిస్తే నీ పిల్లల తరాలు, నీ దేశం, నీ దేశంతో పాటు ఇతర దేశాలు ఆశీర్వాదాన్ని పొందుతాయని దేవుడు ఇశ్రాయేలుకు చెబితే దానికి పూర్తి వ్యతిరేకంగా జీవించి అవమానకరమైన దుస్థితిని కొని తెచ్చుకొంది. గత చరిత్ర చూసినా, ప్రస్తుత పరిస్థితి చూసినా కుటుంబాలు ఒకేలా ఉన్నాయి. ఈనాడు దేవుని దైవిక నియమాలు అతిక్రమించి తమ కుటుంబాలకు, తద్వారా సమాజానికి విపరీతమైన నష్టం తెస్తున్నారు. దైవిక ప్రమాణాలతో పెరిగిన ఒక బిడ్డ పెద్దవాడై సమాజంలో ఒక స్థాయిని సంపాదిస్తే తన చుట్టూ  వెలుగును ప్రకాశింప చేస్తాడు. యేసు

ప్రభు కనికరాన్ని, దయను తను చేసే పనుల్లో చూపెడతాడు. అవినీతి కార్యాలలో పాల్గొనడు. చుట్టూ కాలుష్యాన్ని అరికడతాడు. అది విశ్వాస కుటుంబం సమాజానికి, దేశానికి ఇచ్చే సంపద.

## కుటుంబ ప్రభావం

కుటుంబం అన్ని రకాల వ్యక్తులను ఉత్పత్తి చేసే కేంద్రం వంటిది. దాని నుంచి ప్రతిభావంతులైన, ప్రభావితం చేసే దైవిక విలువలు కలిగిన లేక దుష్ప్రభావం చూపే నాయకులు తయారవ్వడానికి అవకాశం ఉంది. అది తల్లిదండ్రుల పెంపకం, సంఘం, సహవాసంలోని ఆదర్శ వాదుల జీవితాల ప్రభావంపై ఆధారపడి ఉంటుంది.

అబ్రాము తన భార్య శారయి నిమిత్తం ఐగుప్తులో అబద్ధమాడితే దేవుడు దాని కారణంగా ఫరో అతని ఇంటి వాళ్ళందర్నీ బాధించాడు. దేశాలన్నిటికి ఆశీర్వాదంగా ఉండాల్సిన అబ్రాము ఆ సందర్భంలో వాళ్ళకి వేదనకరంగా మారాడు. యాజకుడైన ఏలీ వేరే వాళ్ళ బిడ్డ దేవుని స్వరం గుర్తుపట్టడానికి సాయం చేయగలిగాడు గాని, తన సొంత బిడ్డలను యెహోవా యాజకులుగా వాళ్ళ పని సక్రమంగా నిర్వర్తించడంలో తను సరి చేయలేకపోయాడు.

## ఏలీ పిల్లల దురాగతాలు - దేవుని తీర్పు

ఏలీ దైవ భక్తి కలిగిన, ఆధ్యాత్మిక అంతరార్థం తెలుసుకోగలిగిన, దేవుని స్వరాన్ని గుర్తుపట్టగలిగిన ప్రధాన యాజకుడు. అతని పర్యవేక్షణలో ఎదిగే సమూయేలు చిన్న బిడ్డగా దేవుని స్వరాన్ని గుర్తించకపోతే యెహోవా స్వరాన్ని గుర్తుపట్టగలిగిన ఏలీ అతనికి సాయం చేశాడు. 40 సంవత్సరాలుగా ఇశ్రాయేలీయులను చరిత్రలో మొట్టమొదటిగా



ప్రధాన యాజకుడుగా న్యాయాధిపతిగా సేవించాడు. ఇశ్రాయేలును అద్భుతంగా పాలించగలిగాడు గానీ, ప్రత్యక్ష గుడారంలో తన కొడుకులు హోఫ్నీ, ఫీనెహాసు చేసే దుశ్చర్యలు, దురాగతం దేవుని సహనం పరిమితికి దాటిపోయాయి. పరిశుద్ధ ప్రత్యక్ష గుడారంలో పవిత్రంగా విధులు నిర్వర్తించాల్సిన యాజకులు దేవుని ఆజ్ఞకు వ్యతిరేకంగా సేవించడం వల్ల వాళ్ళు దేవుని ఉగ్రతకులోనై ప్రాణాలు పోగొట్టుకొన్నారు. వాళ్ళకు దేవుని పట్ల, దేవుని విధుల పట్ల ఎలాంటి భయం, గౌరవం లేదు. "ఏలీ కుమారులు యెహోవాను ఎరుగనివారై మిక్కిలి దుర్మార్గులైయుండిరి" (1 సమూ 2:12 ). దేవునికి అర్పించడానికి ముందే వాళ్ళు దేవునికి చెందాల్సిన శ్రేష్టమైన అర్పణను తినడానికి ప్రయత్నించారు. ప్రత్యక్షపు గుడారం ద్వారం వద్ద సేవించే స్త్రీలపట్ల అవమానకరంగా లైంగిక సంబంధం కలిగి వుండడంతో దేవుని ఉగ్రతకు లోనయ్యారు.

ఫిలిష్తీయులకు, ఇశ్రాయేలీయులకు జరిగిన యుద్ధంలో ఇశ్రాయేలీయులు ఘోరంగా ఓటమి పాలైతే, దానిలో ఏలీ కుమారులు చనిపోయారు. అంతకుమించి ఇశ్రాయేలీయుల దేశ చరిత్రకు ఆధారం, వాళ్ళ వారసత్వానికి కేంద్రం అయిన నిబంధన మందసం పట్టబడింది. తరతరాల కోసం మోషేకి ఇచ్చిన పది ఆజ్ఞల పలకలు దానిలో అమర్చబడి ఉంటాయి. దేవుని సన్నిధికి గుర్తుగా ఉంది. ఇశ్రాయేలీయుల అరణ్య మార్గ ప్రయాణంలో వాళ్ళను నడిపించింది, గత యుద్ధాలలో వాళ్ళకు జయాన్నిచ్చింది. దానిని భద్రపరచే, కాపాడే బాధ్యత ఏలీదే. దేవుని ప్రజలకు ఆశీర్వాదంగా ఉండాల్సిన కుటుంబం వాళ్ళ ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నారు. అంత దుర్మార్గమైన జీవితాన్ని జీవిస్తూ దేవుని పవిత్ర మందసం మోయడానికి పూనుకున్న వాళ్ళిద్దరిపై దేవుని తీర్పు బలంగా వచ్చింది."దేవుని మందసమనే మాట అతడు పలకగానే ఏలీ ద్వారము దగ్గరనున్న పీఠము మీదనుండి వెనుకకు పడి మెడవిరిగి చనిపోయెను; ఏలయనగా అతడు వృద్ధుడై బహు స్థూలదేహియై యుండెను. అతడు నలువది సంవత్సరములు ఇశ్రాయేలీయులకు న్యాయము తీర్చెను" (1 సమూ 4 :18). వాళ్ళ మధ్య దేవుని సన్నిధి ప్రభావాన్ని కోల్పోయారు. షిలోహులో నలభై సంవత్సరాలుగా సురక్షితంగా

ఉన్న మందసం విషాదకరమైన పరిస్థితిలో పడింది. “దేవుని మందసము పట్టబడిందన్న సంగతిని, తన మామ, పెనిమిటి చనిపోయిన సంగతిని తెలిసికొని ప్రభావం ఇశ్రాయేలీయులలో నుండి పోయెనని చెప్పి తన బిడ్డకు ఈకాబోదు అను పేరు పెట్టెను”. (1 సమూ 4 :21) దేవుని తీర్పు మూడు తరాల ను తాకింది.

### ఏలీ కుటుంబ పతనానికి కారణాలేంటి?

దేవుని మందిరంలో ఏలీ, తన గృహంలోని ఏలీలో వ్యత్యాసాన్ని చూస్తున్నాం. ఏలీ అన్ని విధాల దేవుని పట్ల నిబద్ధత గల వ్యక్తి. ఆధ్యాత్మిక అంతర్ దృష్టి కలిగినవాడు. దేవునితో నడిచాడు, దేవుని స్వరం గుర్తు పట్టే వ్యక్తి. అతని చెవులు దేవుని స్వరానికి అనుసంధానం చేయబడ్డాయి. దేవుని చిత్తానికి సంపూర్ణంగా అప్పగించుకున్నవాడు, యాజక ధర్మానికి నమ్మకంగా ఉన్నవాడు, మందసం పట్ల అంకిత భావం కలిగిన వాడు. అటువంటి వ్యక్తి తన దేవుని ప్రజలకు అంత నష్టాన్ని ఎలా తెచ్చాడు? తప్పెక్కడ జరిగింది?

#### ఉదాసీనత

ఏలీ పరిస్థితికి, మన పరిస్థితికి కొన్ని సందర్భాలలో దూరం ఎంతో ఉండదు. తన పతనానికి కారణం తన ఇద్దరు కుమారులు, వాళ్ళ నడవడి పట్ల ఏలీ ఉదాసీనత. అతని ఇద్దరు కుమారులు హోఫ్నీ, ఫీనెహాసు తమ తండ్రి బాధ్యతను అవకాశంగా తీసుకుని తమ స్వలాభానికి వాడుకున్నారు. వాళ్ళు చేసిన పాపానికి ఎటువంటి అర్పణ సరిపోదు. అదీ పరిశుద్ధ స్థలంలో చేశారు. దేవుని పట్ల, దేవుని పరిచర్య పట్ల ఎలాంటి భయం, గౌరవం లేదు. వాళ్ళ బాధ్యత దేవుడు అప్పగించినదనే గ్రహింపు లేదు. వాళ్ళు చేసే పాపపు పనులు అంతిమంగా కుటుంబానికి, దేవుని ప్రజలకు, దేశానికి ఎటువంటి నష్టాన్ని తెస్తాయనే అవగాహన లేదు. వాళ్ళు దేవునిని ప్రేమించి ఉంటే, తండ్రిని, దేవుని పరిచర్యను, దేవుని ప్రజలను ప్రేమించి ఉండే వాళ్ళు. వాళ్ళ స్వార్ధ పూరిత పనుల కారణంగా దేవుని మహిమ ఇశ్రాయేలు సమాజాన్ని వదలి వెళ్ళి పోయింది. ఏలీ కుటుంబ వంశం నుంచి దేవుడు యాజకత్వాన్ని తీసివేశాడు.

#### దేవునికంటే కుమారులను ఎక్కువ ఘనపరచడం

ఏలీ పిల్లల పాపపు పనులు చూసి, వాళ్ళ పాపం తీవ్రత గ్రహించి, గద్దించినా వాళ్ళు పట్టించుకోలేదు. దానికి కారణం బహుశా ఏలీ మాటలు తప్ప చేతలేమీ చేసి ఉండడు. క్రియలు లేని మాటలు వ్యర్థం. కొడుకుల పాపాలే కాదు తండ్రి పాపం సైతం దేవుని గాయపరిచింది. “నా నివాస స్థల మునకు నేను నిర్ణయించిన బలి నైవేద్యములను మీరేల తృణీకరించుచున్నారు? మిమ్మును క్రొవ్వబెట్టు కొనుటకై నా జనులగు ఇశ్రాయేలీయులు చేయు నైవేద్యములలో శ్రేష్ఠభాగములను పట్టుకొనుచు, నాకంటె నీ కుమారులను నీవు గొప్ప చేయుచున్నావు” (1 సమూ 2 :29 ). దేవునికంటే కొడుకులను ఎక్కువ ఘనపరిచాడు. కొడుకులను క్రమశిక్షణలో పెట్టకుండా దేవునిని అగౌరవపరిచాడు. ఏలీ తన వాళ్ళను ఆ బాధ్యతల నుంచి తప్పించి ఉండాలి. “నా కుమారుడా, యెహోవా శిక్షను తృణీకరింపవద్దు ఆయన గద్దింపునకు విసుకవద్దు. తండ్రి తనకు ఇష్టుడైన కుమారుని గద్దించు రీతిగా యెహోవా తాను ప్రేమించువారిని గద్దించును” (సామె 3 :11-12 )

ఒక విధంగా వాళ్ళ పట్ల ఉదాసీనంగా ఉన్నాడు. చూసి చూడనట్టు, కొంత అతిగా స్వేచ్ఛనిచ్చాడు. ‘గొప్ప చేయుచున్నావు’ అనే పదం లాటిన్ భాషలో ‘కొంత దయ చూపడం’ అని భావం. దానిలో తప్పు లేదు కాని చెడ్డ వ్యక్తికి చెడ్డ విషయానికి దయ చూపడం తప్పు. పిల్లల్లో ఈ పరిస్థితి ఒకే సారి ఏర్పడింది కాదు, క్రమ క్రమంగా, చిన్న నాటినుంచి పర్వాలేదు, పెద్దయ్యాక తెలుసుకొంటారనే వైఖరి ఇక్కడ వరకూ తెచ్చింది.

మన కుటుంబాలు దేవుని సంఘానికి, సమాజానికి, దేశానికి దీవెనగా ఉండాలని నిర్మిం చాడు. సమూయేలు పరిచర్యను విజయవంతంగా పర్యవేక్షించిన వ్యక్తి సొంత బిడ్డల విషయంలో విఫల మయ్యాడు. సొంత బిడ్డలను క్రమశిక్షణలో పెట్టలేని వాళ్ళం సహవాసంలోని వాళ్ళను సరిదిద్దడానికి ప్రయత్నించడం అంత సరైనది కాదేమో!

#### కుటుంబానికి సమయం ఇవ్వకపోవడం

ఏలీ ప్రధాన యాజకుడు, నాయకునిగా సమాజంలో బహుశా చాలా బిజీగా ఉండి కుటుంబానికి సమయం కేటాయించి ఉండడు. బిడ్డల కోసం అతనికి సమయంలేదు. అనేక పర్యాయాలు

పిల్లలకు సమయం ఇవ్వలేని తలిదండ్రులు ఖరీదైన బహుమానాలను ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. పిల్లల పై డబ్బు పెట్టుబడిగా పెట్టడం కంటే సమయాన్ని వెచ్చించడం మంచిది. లేకపోతే పిల్లల జీవితంలో జరిగే మార్పులు తెలియక, అంతిమంగా విషయాలు విషమించినప్పుడు ఎలా వ్యవహరించాలో తెలియదు. వాళ్ళు ప్రాముఖ్యంగా జీవితంలో తీసుకునే నిర్ణయాలు దేవుని చిత్తానుసారంగా లేకపోతే ఎంతో వేదనగా ఉంటుంది. అవి వాళ్ళు కేవలం అప్పటికప్పుడు తీసుకునే నిర్ణయాలు కావు. దేవునితో, తల్లిదండ్రులతో వాళ్ళకుండే సంబంధం, అవగాహనకు అనుగుణంగానే ఎంచుకుంటారు. దీనికి తల్లి దండ్రులు, సహవాసం దోహదపడతారు.


### అతి నమ్మకం

కొడుకులిద్దరూ ప్రత్యక్షగుడారంలో సేవ చేస్తున్నారని, ఆ పరిశుద్ధ స్థలంలో ఉన్నంత మటుకు ఆధ్యాత్మికంగా బాగానే ఉండి ఉంటారనే అతి నమ్మకంతో ఏలీ భావించి ఉండాలి. పిల్లలను సండే స్కూలుకు పంపి మన బాధ్యత అయిపోయినట్టుగా మనలో ఎందరో భావిస్తాం. మంచిదే, మనం మన పిల్లలకు చేయవలసిన బాధ్యతను వేరే వాళ్ళకు అప్పగించడం మంచిది కాదు. పిల్లల ప్రాథమిక ఆధ్యాత్మిక పోషణ క్రైస్తవ కుటుంబంలో ఆరంభమవుతుంది. దేవుడు స్వాస్థ్యంగా మనకిచ్చిన బిడ్డలు కుటుంబానికి, సమాజానికి, దేశానికి అంతిమ ఆశీర్వాదంగా ఉండాలి, దేవునిని యధార్థ జీవితాలతో సేవించాలి.

### ముగింపు

ఏలీ కుటుంబం దేవుడు బహుమానంగా ఇచ్చిన జీవితాన్ని, అప్పగించిన పవిత్ర బాధ్యతలను చులకనగా తీసుకొని, పాపాన్ని సహించి ఏలీ, పాపం చేసి అతని కొడుకులు దేవుని మహిమను భద్రపరచడానికి బదులు దేవుని ప్రజలను వదలి వెళ్లి పోవడానికి కారణమయ్యారు. బహుశా మన వ్యక్తిగత జీవితాలు, కుటుంబ జీవితాలు అలాంటి దారిలోనే అడుగులు వేస్తున్నాయేమో? ఆశీర్వాదాలను పంచడానికి పిలుపును పొందిన మనం మన కుటుంబాలకు, సహవాసానికి, సమాజానికి, దేశానికి ఏమిస్తున్నాం?

– బి. మంజుల లాజరస్,
నేషనల్ రిటైర్డ్ స్టాఫ్, హైదరాబాద్




## రాలుతున్న రత్నాలు

గంజాయి మత్తులో యువత
మాయ వలయంలో మునిగి,
మకరందంలాంటి జీవితాన్ని వదిలి,
మైనము వలె కరుగుతూ
మొగ్గదశలోనే రాలుతున్నారు

ఆకర్షించే పైపై అందాలకు లోనై
అలల వంటి సమస్యలను అలంకరించుకొని
క్షయమయ్యే లోకాశలకు లొంగి
అక్షయుడగు దేవునిని తెలుసుకోలేక
చిరు దశలోనే రాలుతున్న యువతరం

వదలిన విశ్వాసంతో అవివేకులై
సడలిన విశ్వాసంతో సమస్యలకు కృంగి
సుగుణాల సర్వశక్తుని వదిలి
సత్యంలో సాగిపోక, ఆత్మీయతలో ఆగిపోయి
సాతానుకు దగ్గరవుతున్నారు విశ్వాసతరం

పసలేని ప్రార్థనతో పాపంలో పడిపోక
పాతాళానికి పరుగులు తీసే వారికోసం
పట్టుదలతో ప్రార్థిస్తూ
పాపంపై పోరాడి గెలిచిన క్రీస్తుని పోలి నడుస్తూ
రాలిపోక రగులుతూ క్రీస్తులో ముందుకు సాగిపో

– సంగర్తి హరీష్, మెట్ పల్లి, జగిత్యాల జిల్లా

# పిరికివాడివా? పరాక్రమ బలాఢ్యుడివా?

## (న్యాయాధిపతులు 6:1-32)

### నేపథ్యం

దేవుడు ప్రజల కష్టాలు తొలగించి క్షేమము ఇవ్వడానికి నాయకులను లేవనెత్తుతాడు. ఆశ్చర్యకరమైన నేపథ్యాల నుంచి సాదాసీదా మనుష్యులను పిలుచుకొని, సామర్థ్యాలను ఇచ్చి వారి తరము వారికి సేవచేయడానికి నాయకత్వాన్ని చేపట్టేలా చేస్తాడు. దేవుడు, దేవుని కార్యాలు తెలియక, ఆయన్ను తిరస్కరించి మనకు మనమే తెచ్చుకొనే కష్టాలు, ఇబ్బందులకు కొన్నిసార్లు దేవుని నిందిస్తాము, ప్రశ్నిస్తాము. అలా ప్రశ్నలతో ఉన్న ఒక పిరికి వ్యక్తిని దేవుడు దర్శించి తన ప్రజల బాధల నుండి విడిపించడానికి ధైర్యము చెప్పి, గొప్ప నాయకుడిగా ఎలా చేశాడో చూద్దాం.

### ప్రశ్నలు

1. గిద్యోనును దేవుడు దర్శించిన సందర్భం ఏంటి? గిద్యోను ప్రజల, దేశ, కుటుంబ, వ్యక్తిగత స్థితిని స్టడీ చేయండి. న్యాయా 6:1-11.
2. దేవుడు గిద్యోనును దర్శించిన విధానం గమనించండి.
3. దేవుడు గిద్యోనును ఎలా చూశాడు? గిద్యోను తననుతాను ఎలా చూచుకొన్నాడు? (న్యాయా 6:12-16) ఏది కరెక్ట్? మనలను మనము ఎలా ఎంచుకోవాలి? మన సామర్థ్యాలను ఎలా అంచనా వేసుకోవాలి?
4. "నీకు తోడైయున్నానన్న" దేవునిని గిద్యోను ఏ ప్రశ్నలు అడిగాడు? దేవునిని ప్రశ్నించవచ్చా? గిద్యోను గురించి మనకు ఏమి అర్థమవుతుంది?
5. గిద్యోను ప్రశ్నలకు దేవుని స్పందన ఏంటి? గిద్యోను సందిగ్ధతకు దేవుని పరిష్కారము గురించి ఏమి అర్థం చేసుకొంటాము?
6. దేవుడు నాయకులను ఎన్నిక చేసే పద్ధతి నుంచి నేర్చుకోవలసిన ముఖ్యమైన పాఠం ఏంటి?
7. గిద్యోను దేవదూత రూపంలో దేవుని నుండి ఒక సూచన అందుకొన్నప్పటికీ ఎందుకు అంత సందేహాస్పదంగా ఉన్నాడని మీరు అనుకొంటున్నారు?



8. గిద్యోనుతో దేవుడు చెప్పిన భరోసా మాటలు ఏంటి? (వ. 12,14,16,23) ఏం అర్థము చేసుకొంటాము?
9. దేవుడు గిద్యోనుకు ఇచ్చిన మొదటి పని ఏంటి? ఎలా చేశాడు? రిస్క్‌ని, దాడిని ఎలా ఎదుర్కొన్నాడు? (6:25-27).
10. స్వంత ఇంటిలో ప్రక్షాళన చేయడం సులభమా? కష్టమా? చర్చించండి. మనము ఏమి నేర్చుకొంటాము?
11. దేవుడు తోడు ఉంటే కష్టాలెందుకు? నేను, నా కుటుంబం ఎంత? అసలు నీవేనా దేవా మాట్లాడుతున్నది? అని ప్రశ్నించే వారిని దేవుడు వదిలిపెట్టకుండా ప్రోత్సహించడంలో దేవుని సహనాన్ని గూర్చి చర్చించండి. మనం ఏమి నేర్చుకోవాలి?

దేవుడు ఎప్పుడూ మన సామర్థ్యాలు, అసమర్థతలకు మిన్నగా బలపర్చి బలవంతులుగా చేస్తాడు. నాయకుని బలహీనతలను బలంగా మార్చడం ద్వారా మనుష్యులు కాకుండా దేవుడు మాత్రమే మహిమ పొందుతాడు. దేవుని మీద మన విశ్వాసము పెంపొందే ప్రక్రియలో దేవుడు సహనంతో ఉంటాడు. దేవుడు మిమ్మును చూచినట్టు మిమ్ములను మీరు చూడగలరా! దేవుని తోడు, దేవుని సహాయం, దేవుని బలము, భరోసాతో భయము లేకుండా దేవుని పిలుపుకు లోబడదామా! దేవుని పనిని చేపడదామా!

– విజె డెస్క్



# పిల్లలు లేకపోవడం శాపమా?

వివాహితులైన దంపతులు ఇద్దరుగానే మిగిలిపోయి తమ కుటుంబ జీవితం కొనసాగించడానికి అనగా పిల్లలు లేకుండా ఉండడానికి ఎన్నో కారణాలు భౌతికంగా ఉండవచ్చు. శరీర ధర్మశాస్త్ర ప్రకారం వారిలో ఒకరు గాని లేక, ఇద్దరు గానీ పిల్లలు పుట్టకుండా ఉండడానికి కారణం కావచ్చు. కొన్నిసార్లు వాళ్ళ జనన వ్యవస్థ లేక పునరుత్పత్తి వ్యవస్థ అంతా సవ్యంగానే ఉన్నా పిల్లలు అనే దేవుని ఈవి వాళ్ళకు అందకపోవచ్చు. కారణాలు ఏవైనా కుటుంబంలో పిల్లలు లేకపోవడం కొంచెం కష్టమైన, సవాలుతో కూడిన పరిస్థితి అని గుర్తించవచ్చు.

పిల్లలు లేకపోవడం గృహంలో ఒక ఖాళీని కల్పిస్తుంది. అదే సమయంలో హృదయంలో కూడా భావోద్రేకతతో కూడిన శూన్యం ఏర్పడుతుంది. కాలానుగుణంగా ఆ లోటు యొక్క ప్రభావం తగ్గుతూ రావచ్చు, కానీ పూర్తిగా మాసిపోదు (సామె 30:15,16). దేవుని వాక్య ప్రకారం భార్యాభర్తలు కుటుంబం అనడానికి అన్ని అర్హతలు ఉన్నా పిల్లలు లేకపోవడం వల్ల మనకి అది అసంపూర్ణంగా అనిపిస్తుంది.

పిల్లలు లేని ఆ కుటుంబం దాని గురించి పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కానీ వారి హృదయంలో ఆ బాధ కొంచెం అయినా మిగిలి ఉంటుంది. తక్కిన కుటుంబాలతో, స్నేహితులతో కలుసుకున్నప్పుడు ఏదో వెలితి ఉన్నట్లు అనిపిస్తుంది. పిల్లలు ఉన్నవారు వారి పిల్లలతో బిజీగా ఉన్నప్పుడు, వారి సంభాషణలో పిల్లల ప్రస్తావన ఎక్కువగా వస్తూ ఉంటుంది. అలాంటి సంభాషణలో పిల్లలు లేని వారు పాల్గొనడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. మన సామాజిక కార్యకలాపాలు సాధారణంగా పిల్లలతో ముడిపడి ఉంటాయి. మనకు పిల్లలనివ్వడం దేవుని చిత్తం కాదు అని చెప్పడం ఒక వంతు అయితే దానిని ప్రతిరోజు అనుభవించడం మరొక వంతు. పిల్లలు కలిగే ఆ సంవత్సరాలు దాటిపోతున్నప్పుడు, పిల్లలు కలిగే నిరీక్షణ తగ్గిపోతున్నప్పుడు, వివాహ ప్రారంభంలో ఉన్న కలలు, ఊహాగానాలు కలలు గానే మిగిలిపోవడం, ముసలివారైన తర్వాత మనలను చూసుకొనేవారెవరు అనే భయం కూడా దు:ఖాన్ని పెంచుతుంది.

## కుటుంబం

దేవుడు కుటుంబాన్ని మొట్టమొదట ప్రారంభించినప్పుడు భార్య, భర్తను కలిపి కుటుంబంగా పిలిచాడు. అది పిల్లలు లేకపోవడం వలన అసంపూర్ణం కాదు. వివాహ ప్రమాణాలలో ఎక్కడా పిల్లల ప్రస్తావన ఉండదు. ఆదికాండము 2:21-24

వచనాలలో దేవుడు భార్యా భర్తల మధ్య ఉంచిన అద్భుతమైన బంధం అర్థం చేసుకోగలము.

ఆదాము నా యెముకలలో ఒక ఎముక, నా మాంసములో మాంసము, నరునిలో నుండి తీయబడింది కాబట్టి నారి అనబడుతుంది. దీని కారణంగా పురుషుడు తన తల్లిని తండ్రిని విడిచి తన భార్యను హత్తుకొంటాడు, వారు ఏకశరీరముగా ఉంటారు అనే బలమైన మాటలు వారి బంధాన్ని వివరిస్తున్నాయి.

వారు ఇద్దరు కాదు, ఒకళ్ళే అని మార్కు 10:8లో ప్రభువు వారు ఈ మాటలు రెట్టించి చెప్పాడు. వారు శరీరం, ప్రాణం, ఆత్మలో ఒకటై పోతారు. పిల్లలు ఉన్నా లేకపోయినా దేవుడు ఈ కుటుంబం అనే యూనిట్‌కు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి తన ప్రతిబింబంగా ఉండాలని వారిలో తన స్వరూపాన్ని చూడాలని కోరతాడు. మనం చాలాసార్లు క్రీస్తు స్వారూప్యంలోకి వ్యక్తిగతంగా ఎదగాలి అనుకొంటాం, అది సత్యమే. కానీ కుటుంబంగా భార్యాభర్తలు ఇద్దరూ కలిసి త్రిత్వాన్ని అనగా త్రియేక దేవుని స్వరూపాన్ని లోకానికి చూపాలని దేవుని కోరిక. ఆ స్వరూపంలో పిల్లలు లేరు.

దేవుని స్వరూపంలో (త్రిత్వంలో) సమానత్వం, సహకారత్వం, ఏకత్వం, తగ్గింపు, విధేయత, గౌరవించుకోవడం, ఒంటరితనం లేకపోవడం, ఊహకందని ప్రేమాభావం, నమ్మకత్వం... ఇలా ఎన్నో దైవిక లక్షణాలకు భార్యాభర్తల బంధం ప్రతిబింబం.

ఈ బంధంలోనుండి పిల్లలు ఇవ్వడానికి, ఇవ్వకపోవడానికి దేవునికి సర్వాధికారం ఉంది. పిల్లలు కలిగి ఉండడం ఆశీర్వాదంగా దేవునివాక్యం ఎక్కడా చెప్పలేదు. బహుమానం అని, ఈవి అని ఉంది. ఆశీర్వాదాలు కొత్తనిబంధనలో భౌతికం కాదు. మత్తయి 5:3-11లో చాలా స్పష్టంగా ఆశీర్వాదాల పట్టిక ఇయ్యబడింది. పిల్లలు లేకపోవడం దేవుని శాపం కాదు, లేక అది దేవుని శిక్ష కాదు. విశ్వాసులైన భార్యాభర్తలు దేవుని పిల్లలు. వారికి ఏవి ఇవ్వాలో, ఏవి ఇవ్వకూడదో ఆయన ఇష్టం. రోమా 8:28లో రాయబడింది చెప్పడం చాలా సులభం కానీ పిల్లలు లేనివారికి అది చాలా అర్థరహితంగా ఉండవచ్చు కానీ దానిని అర్థం చేసుకొన్నప్పుడు అది ఎంతో ఆదరణ ఇస్తుంది.

**తక్కిన కుటుంబాలు తమ పిల్లలతో సంతోషంగా ఉంటుంటే, నేను కూడా ఆత్మదేవుడిచ్చే ఆనందంతో జీవించాలి. ఆయన మన పక్షం. సాతానుడు మనకు దేవుని మీద తీసుకొనివచ్చే తలంపులు, ఒక విధమైన విరోధభావం, నిరాశలను అధిగమించాలి. వాడు మన మీద నేరారోపణ చేస్తాడు. నీవు చేసిన తప్పులకే ఈ శిక్ష వచ్చింది అని పచ్చి అబద్ధం చెప్తాడు. ఆయన ప్రేమ మన కొరకు ఎప్పుడూ ఉంది.**

రోమా 8:28 యొక్క సందర్భం నిత్యత్వం గురించి. 18వ వచనంలో భవిష్యత్‌లో దేవుని మహిమ ప్రత్యక్ష్యం కాబోతుంది. దానిముందు ఈ పిల్లలు లేనితనం లెక్కలోకి రాదు. సృష్టి బాధతో మూలు గుతుంది, ఎందుకంటే పాపము వలన సృష్టి మొత్తం ప్రభావితం అయ్యి నాశనానికి లోనయ్యింది. ఒక విధమైన దాస్యంలోకి వెళ్ళిపోయింది. దేవుని పిల్లలు అంటే మనమే, విశ్వాసులము ప్రభువు రెండవసారి వచ్చినప్పుడు ఒక అద్భుతమైన మహిమగల స్వాతంత్ర్యము పొందబోతున్నాము. మహిమ దేహము రాబోతుంది. పిల్లలు ఇవ్వలేని ఈ దేహం పోయి మహిమదేహం వస్తుంది. అప్పుడు మనలాగా మహిమ దేహం పొందిన వారెవ్వరికీ నిత్యత్వంలో పిల్లలుండరు. ఈ అద్భుతం జరగడానికి సమయం చాలా సమీపంగా ఉంది.

ఆత్మదేవుని రుచిచూచిన మనం పరలోక మహిమను కొంచెం రుచి చూశాము. ఎప్పుడు ఆ మహిమ దేహం వస్తుందా అని ఎదురు చూస్తూ ఈ పాత దేహంలో మూలుగుతున్నాము. ఈ దేహానికి అన్నీ సమస్యలే. కానీ లోపంలేని దేహం వస్తుంది. పిల్లలు అనే సమస్యలేని నిత్యత్వంలోకి వెళ్ళబోతున్నాము.

ఈ సందర్భంలో మనకు కొన్నిసార్లు ఎలా ప్రార్థన చేయాలో తెలియదు. పిల్లల కోసం ప్రార్థించడం

దేవుని చిత్తమా కాదా తెలియదు. పుడతారో లేదో తెలియదు. ఆ మూలుగుతో మనం దేవుని సన్నిధిలో కూర్చున్నప్పుడు మన ప్రార్థనను ఆత్మదేవుడు అందుకొని ఆయన ఉచ్చరింపశక్యము కాని మనకు తెలియని విధంగా ఆయనే మన మనస్సును అర్థం చేసుకొని దేవుని చిత్తం ఏమిటో దానికి అనుగుణంగా ప్రార్థన చేస్తాడు.

ఆ విధంగా దేవుని ప్రేమించువారికి వారి కష్టాలలో, బాధలలో, హృదయ వేదనలో వారి కి మేలు కలుగునట్లు ఆయన పరిస్థితులను వారికి అనుకూలంగా మార్చి, వారి ఆత్మీయ ఎదుగుదలను, పరిపక్వతను కలగజేస్తాడు. ఆయన సారూప్యత వ్యక్తిగతంగాను, కుటుంబంగా కూడా అనుగ్రహిస్తాడు. మనం దిగులు చెందాల్సింది ఏమీ లేదు.

నిన్ను, నన్ను ముందుగా ఎరిగినవాడు, నీ పరి స్థితి ముందుగా తెలిసిన వాడు, నీకు పిల్లలు కలగాలో లేదో, లేకపోతే ఎందుకు ఇవ్వలేదో ఎరిగిన వానిచేతిలో మనం ఉన్నాం కాబట్టి, అసలు దిగులు, చింత మాని ఆయన నిత్యత్వంలో మనకు ఇయ్యబోయే బహుమానం మీద మనం దృష్టి ఉంచుదాం. ఆయన ప్రేమ నుండి ఈ "పిల్లలు లేని తనం" కూడా మనలను దూరం చేయదు.

ఇప్పుడు మన దృక్పథం ఎలా ఉండాలి? ఈ సవాలును కుటుంబంగా ఎలా ఎదుర్కోవాలి?

దేవునికి ఒక ప్రణాళిక ఉంది. అది అత్యుత్తమం. అది నాకు మేలు. అది నాకు అర్థం కాకపోయినా పర్వాలేదు. ఆయన వాగ్దానం ఉంది చాలు. "ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి దేవుడు మేలు చేస్తాడు. ఆయన చేసే మేలుకోసం ఆయన అన్నిటిని నియంత్రిస్తాడు". క్రైస్తవ విశ్వాస జీవితం వాగ్దానాల మీద కట్టబడుతుంది. కానీ వివరణల మీద కాదు. నాకు అర్థం అయినా కాకపోయినా నాకు వాగ్దానం చాలు.

## ఈ సమయంలో కుటుంబంగా ఏమి చేయాలి?

తక్కిన కుటుంబాలు తమ పిల్లలతో సంతోషంగా ఉంటుంటే, నేను కూడా ఆత్మదేవుడిచ్చే ఆనందంతో జీవించాలి. ఆయన మన పక్షం. సాతానుడు మనకు దేవుని మీద తీసుకొనివచ్చే తలంపులు, ఒక విధమైన విరోధభావం, నిరాశలను అధిగమించాలి. వాడు మన మీద నేరారోపణ చేస్తాడు. నీవు చేసిన తప్పు లకే ఈ శిక్ష వచ్చింది అని పచ్చి అబద్ధం చెప్తాడు. ఆయన ప్రేమ మన కొరకు ఎప్పుడూ ఉంది.

మనకు దేవుడిచ్చిన జీవితంలో తృప్తిగా జీవించడం, దేవుని సంతోషపరచడమే మన గురి. బిడ్డలు లేని దంపతులు బిడ్డలు కలిగి ఉండడానికి దేవుడిచ్చిన తక్కిన ప్రత్యామ్నాయాలను జ్ఞానయుక్తంగా పరిగణించాలి. ఉదా. ఐవియఫ్, కృత్రిమ వీర్య స్ఖలనం, దత్తత. దత్తత వలన మరొక బిడ్డకు తల్లిదండ్రులను అందించిన గొప్పభాగ్యం కలు గుతుంది. బిడ్డలు లేకపోవడం ఎంత బాధనిస్తుందో దానికంటే ఎన్నోరెట్లు బాధ తల్లిదండ్రులు లేని బిడ్డ అనుభవిస్తాడు. అయితే, దత్తత ప్రక్రియ కొంచెం క్లిష్టమైనది. ఆలస్యమయ్యేది.

## దృక్పథం చాలా ప్రాముఖ్యం

పిల్లలు లేని దంపతులు దేవుని వాక్య ఆధారంగా తమ దృక్పథాలను సరిచేసుకోవాలి. మన చుట్టు ఉన్న సంస్కృతి, మనుషులు, లోకవ్యవస్థ మన దృక్పథాన్ని ఏర్పరచుకోవడానికి సహాయపడతాయి. కానీ మనం రక్షణపొందిన తర్వాత మనలోని చాలా దృక్పథాలు తప్పు అని అర్థమవుతుంది. అప్పుడు దేవుని వాక్యం ఏమి చెప్తుంది అని వెదకి దాని ప్రకారం మన దృక్పథాన్ని మార్చుకోవడం జరగాలి. దీనినే రూపాంతరం చెందడం అని దేవుని వాక్యం రోమా 12:2లో చెబుతుంది.

మానవ జీవితంలో దేవుడు ఎలాంటి సార్వభౌమాధికారం కలిగి ఉంటాడో దేవుని వాక్యం చెబుతుంది.

ప్రసంగి, జీవితం గురించి చాలా పరిశోధన చేసి ఆరు ముగింపు సూత్రాలు చేశాడు. అందులో మొదటిది జీవితాన్ని అంగీకరించడం (3:12-15). దేవుడు నీకిచ్చిన దానితో తృప్తిచెంది కృతజ్ఞతతో అంగీకరించి దానిని దేవుని చిత్తంలో ఆయన మహిమార్థం అనుభవించడం. దేవుడిచ్చే ఈవుల ను అనుభవించే భాగ్యం కూడా దేవుని దగ్గర నుండే వస్తుంది (2:24). ఆయన సెలవు లేక భోనము చేసి సంతోషించుట ఎవరికి సాధ్యం?

ప్రసంగి 3:1-8 వచనాలలో 14 విషయాలను చెప్పి సొలొమోను దేవుడు ఒక వ్యక్తి జీవితంలో

ఏవిధంగా తన కార్యాలు జరిగిస్తాడో చెబుతున్నాడు. మనం పుట్టకముందు నుంచి మనం చనిపోయేదాకా ఈ సమయాలు మన జీవితంపై ఒక దైవిక ప్రభావాన్ని చూపిస్తాయి. ఇవి వాటివాటి సమయాల్లో మన జీవితంలో దేవుని ఏర్పాటు ప్రకారం సంభవిస్తాయి. వీటిని వాటి సమయంలో మనం జరిగించినప్పుడు అవి ఎంతో సంతోషాన్ని, సమాధానాన్ని మనకు ఇస్తాయి. మనం దేవుని సమయంలో ఆయనతో సహకరించాలి. అప్పుడే జీవితం అర్థసహితంగా ఉంటుంది. పిల్లలు లేకపోవడం అనే ఈ లోటును దేవుడే తన ఆధీనం కింద ఉంచాడు. పిల్లలు జన్మించడం, లేక చనిపోవడం అనేది ఆయన ఆధీనంలో ఉంటుంది. అలా చేయడం ద్వారా దేవుని ప్రణాళిక, ఏర్పాటు మనకు అర్థం కాకపోవచ్చు కానీ, అది మనకు ఎంతో మేలు చేస్తుంది. దేవునికి మనపట్ల నిత్యమైన మంచి తన మనస్సులో ఉంటుంది. ఆ నిత్యత్వాన్ని దృష్టిలో పెట్టుకొని దేవుడు మన జీవితంలో కొన్ని అనుమతిస్తాడు, కొన్ని అనుమతించడు. దానిని మనం నమ్మాలి. ఎందుకంటే ఆయన సమస్తము సమకూడి మేలు కొరకు జరిగిస్తాడు అని ఆయన వాగ్దానం ఉంది. అది తప్పుకాదు, కాకూడదు.

**ఇద్దరుగా ఉన్న ఈ కుటుంబం ఇప్పుడు ఎలా జీవించాలి? ఆ జీవితాన్ని దేవునిలో ఎలా ఆనందంగా గడపాలి?**

1. దేవునికి మీ కుటుంబంలో, మీ వ్యక్తిగత జీవితాలలో అత్యంత ప్రధానమైన స్థానం ఇవ్వాలి. నా పిల్లలకంటే, నా భర్తకంటే, నా భార్యకంటే మీకే నా ప్రథమ స్థానం అని ధైర్యంగా దేవునితో చెప్పగలగాలి.
2. త్రియేక దేవుని స్వరూపాన్ని మా కుటుంబ జీవితంలో ప్రతిబింబిస్తాము అనే ప్రతిజ్ఞ తీసుకోవాలి.
3. మా ఇద్దరి మధ్య సాతానుడు విభేదాలను తీసుకొని రాకుండా మా వివాహ జీవితాన్ని దేవుని అధికారం కింద ఉంచుతాము.
4. ఆయన మా జీవితాలలో ఏమి చేయాలని సంకల్పించాడో ఆ సంకల్పాన్ని పూర్తిగా నెరవేర్చడానికి మా జీవితాలను ఆయన చేతుల్లో పెడతాము, ఆయనతో సహకరిస్తాము.



5. పిల్లలు లేకపోవడం వలన మాకు అందివచ్చే మిగిలిన సమయం దేవుని చిత్తానుసారంగా ఎలా వినియోగించుకోవాలో దేవునిని అడిగి అలా జరిగిస్తాము.
6. మా చుట్టూ ఉన్న అనేక ఇజియంఫ్ కుటుంబాలకు మా వంతు సహాయం చేస్తాము (పిల్లల్ని చూసుకోవడం, హాలిడే కీపింప్, కౌన్సిలింగ్, క్లాస్ సబ్జెక్ట్‌లను బోధించడం, మోటివేషన్ ..)
7. మాకు అందుబాటులో ఉన్న వృద్ధాశ్రమాలు, అనాధశరణాలయాలను దర్శించి వారికి దేవుని ప్రేమను చూపించడం ద్వారా వారికి పరిచర్య చేస్తాము.
8. మాలాగా పిల్లలు లేని కుటుంబాలకు ఈ సమస్యలను ఎలా అధిగమించాలో నేర్పిస్తాము, బోధిస్తాము.
9. దేవుడు మాకిచ్చిన ఖాళీ సమయంలో భార్యాభర్తలుగా మేము ఒకరిని ఒకరం ప్రోత్సహించుకొంటూ, విజిటింగ్, వారాంతర దినాల్లో పిక్నిక్, టూర్స్ చేస్తాము. దేవుడు మాకిచ్చిన జీవితాన్ని ఆయన చిత్తానుసారంగా ఆనందిస్తాము.
10. కలిసి దేవుని రాజ్య విస్తరణలో పాలి భాగస్తులుగా జీవిస్తాము.

**– కె. దేవిడ్ రాజ్ కుమార్,** గుంటూరు



# సమకాలీన
# క్రైస్తవ దురాచారాలు



యోహాను సువార్త 17వ అధ్యాయంలోని తన ప్రధాన యాజక ప్రార్థనలో, మన ప్రభువైన యేసుక్రీస్తు సార్వత్రిక సంఘం గురించి ప్రత్యేకంగా కొన్ని సమస్యలపై దృష్టి సారించాడు. యేసు తనకు అప్పగించిన, నెరవేర్చిన పని గురించి, దేవుని మహిమ, నెరవేర్చబడిన దేవుని చిత్తం గురించి తండ్రికి ప్రార్థించడమే కాకుండా, “వారంతా ఏకమవులాగున” అని తన శిష్యుల కోసం ప్రార్థించాడు. ఆయన మనవులలోని ఏకైక అంశ సారాంశం, భూమిపై యేసు స్థాపించిన రాజ్యం, కొత్త సమాజం ముందు ఉన్న అంతర్లీన సవాలు ఐక్యతే.

ఈ రోజు దేవుని కుటుంబం, దేవుని మంద, దేవుని రాజ్యం, దేవుని సంఘం, క్రీస్తు శరీరం, దేవుని ఇల్లు, దేవుని భవనం విపరీతమైన సమస్యలు లోపల నుండే ఎదుర్కొంటుంది. దేవుని దర్శనం నుండి సంఘాలు ఎంత దూరం వెళ్ళాయి, సెలబ్రిటీ కల్చర్, డినామినేషన్స్ విభజనలు, సంఘాల్లో రాజకీయాలు, గ్రూపిజం, కోర్టు కేసులు, ఆర్థిక మోసాలు... మొదలగు వాటి గురించి వివరంగా గత సంచికలో చూశాం. ఈ సంచికలో సంఘాల్లో అనైక్యతకు కారణాలు, వాటిని అధిగమించి ఐక్యత ఎలా సాధించాలనే విషయాల్ని చూద్దాం.

*గత సంచిక తర్వాత...*

బైబిల్ అనేక చోట్ల సంఘంలోని విభజనల ను ప్రస్తావించి విశ్వాసుల మధ్య ఐక్యత, ప్రేమ, పరస్పర అవగాహన యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. విభజన సమస్య పరిష్కారం గూర్చి కొత్త నిబంధనలో పౌలు రాసిన పత్రికలలోని కొన్ని విషయాలు చూద్దాం:

**కొరింథీయులు:** కొరింథీయులకు పౌలు రాసిన మొదటి లేఖ బహుశా చర్చిలోని విభజనలకు అత్యంత సూటియైన చికిత్స. వివిధ క్రైస్తవ నాయకులకు విధేయత ఆధారంగా కొరింథియన్ విశ్వాసులు తమను తాము వర్గాలుగా విభజించుకున్నారు (1 కొరింథీ 1:10-13). పౌలు వారిని గట్టిగా హెచ్చరించి, ఐక్యతను ప్రోత్సహిస్తున్నాడు. మానవ నాయకులకు విధేయత కోసం సంఘం విభజించబడకుండా క్రీస్తులో ఐక్యంగా ఉండాలని వారికి గుర్తు చేస్తున్నాడు. అందరూ క్రీస్తుకు చెందినవారని, క్రీస్తు విభజించబడలేదని అతను నొక్కి చెప్పాడు.

**కొరింథీ ప్రశ్న:** మనము ఎవరికి చెందినవారం? క్రీస్తుకా లేక మనకు నచ్చిన ఒకరిద్దరు సెలెబ్రిటీలు లేక నాయకులకా?

**ఎఫెసీయులు:** ఎఫెసీయుల్లో, పౌలు సంఘం యొక్క ఐక్యతను క్రీస్తు శరీరంగా చర్చించాడు. అతను

"ఒకే శరీరం, ఒకే ఆత్మ" అని పేర్కొన్నాడు. యేసు క్రీస్తు విశ్వాసం, జ్ఞానంలో ఐక్యతను నొక్కి చెప్పాడు (ఎఫెసీ 4:3-6,13). అతను విశ్వాసులను ఒకరితో ఒకరు ప్రేమలో సహించమని, శాంతి బంధం ద్వారా ఆత్మ యొక్క ఐక్యతను కాపాడుకోవాలని ప్రోత్సహించాడు.

**ఎఫెసీ ప్రశ్న:** మన మాట ద్వారానో, వైఖరి ద్వారానో, వాదనల ద్వారానో సహవాసంలో మనవల్ల చీలికలు వస్తే మనం పరిశుద్ధాత్మునికే వ్యతిరేకముగా పని చేస్తున్నామని గ్రహించామా?

**గలతీయులు:** గలతీయులలో, పౌలు భిన్నమైన విభజనను ప్రస్తావించాడు, ఇక్కడ యూదులు, అన్యుల్లో నుండి వచ్చిన విశ్వాసులు ధర్మశాస్త్రం, సున్నతి సమస్యలపై విభేదించారు. పౌలు క్రీస్తులో ఐక్యత కోసం తీవ్రంగా వాదించాడు. క్రీస్తులో యూదుడు లేదా అన్యజనుడు, బానిస లేదా స్వతంత్రుడు, మగ లేదా ఆడ అని బేధాలు లేవని, క్రీస్తు యేసులో అందరూ ఒక్కటే అని వాదించాడు (గలతీ 3:28).

**గలతీ ప్రశ్న:** మనం సహవాసంలో ఇతరులతో ఐక్యతకు కారణాలు వెతుకుతుంటామా లేక కుల, లింగ, ప్రాంత, భాషా, జాతి, విభేదాలను వెతుకుతున్నామా?

**రోమీయులు:** రోమా పత్రికలో, ఆహార నియమాలు, పవిత్ర దినాలు (రోమా 14:1-13) వంటి వివాదాస్పద విషయాలపై పౌలు స్పందించాడు. ఒకరినొకరు తీర్పు తీర్చుకోవద్దని, శాంతికి, పరస్పర సవరణకు దారితీసే వాటిని చేయడానికి ప్రతి ప్రయత్నం చేయాలని ఆయన విశ్వాసులకు సలహా ఇచ్చాడు.

**రోమా ప్రశ్న:** వాక్యం మనలను ఐక్య పరుస్తుందా లేక సిద్ధాంతాలనూ, ఆచారాలనూ అపార్థం చేసుకొని వాక్యం వలనే విడిపోతున్నామా?

**ఫిలిప్పీయులు:** చర్చ్‌లో స్పష్టంగా విభేదిస్తున్న ఇద్దరు స్త్రీలు యువొదియను, సుంటుకేను మధ్య వ్యక్తిగత సయోధ్య కోసం పౌలు విజ్ఞప్తి చేశాడు (ఫిలిప్పీయులు 4:2-3). క్రీస్తులో ఒకే మనస్సుతో ఉండడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పాడు.

**ఫిలిప్పీ ప్రశ్న:** వ్యక్తిగత కలహాలు అనే విషాన్ని చిమ్ముతూ, అమాయక మనసులను కలుషితం



చేస్తూ విభజనలకు కారణమయ్యే చెద పురుగులం అవుతున్నామా?

**కొలస్సయులు:** కొలస్సీలో, పౌలు కనికరం, దయ, వినయం, సౌమ్యత, ఓర్పును వారు ధరించు కోవాలని, ఒకరిని ఒకరు భరించడం, క్షమించుకోవాలని ప్రోత్సహిస్తున్నాడు. అన్నింటికంటే మించి, ప్రేమను ధరించమని ఆయన వారికి చెప్పాడు. ప్రేమ సంపూర్ణ సామరస్యంతో బంధిస్తుంది (కొలస్సీ 3:12-14).

**కొలస్సీ ప్రశ్న:** మానవ విలువలు మంటగలు పుతూ, ఆధ్యాత్మిక విలువలు నీరు గారుస్తూ, ప్రేమను ప్రామాణికంగా చూపాల్సిన మనం, అసహనం, ద్వేషం, క్షమించలేని మనసు గల సాతాను లక్షణాలకు బానిసలమయ్యామా?

ఈ వాక్యభాగాలన్నింటిలో, సంఘంలో ఐక్యతను గూర్చి అత్యంత ప్రాముఖ్యమైన సందేశం ఉంది. విభజనలు సంఘం యొక్క ఆధ్యాత్మిక ఆరోగ్యానికి హానికరం, సాక్ష్యంగా పరిగణించబడతాయి. క్రీస్తులో విశ్వాసుల ఉమ్మడి గుర్తింపుపై స్థాపించబడిన పరస్పర సయోధ్య, శాంతి, గౌరవం యొక్క స్ఫూర్తిని గూర్చి బైబిల్ వాదిస్తుంది.

అపొస్తలుడైన పేతురు తన మొదటి పత్రికలో క్రైస్తవ సంఘం యొక్క ఐక్యతను విస్తృతంగా ప్రస్తావించాడు. అతని విధానం విశ్వాసుల మధ్య బల మైన బంధం యొక్క గుర్తింపును నొక్కి చెబుతుంది. ఇది వినయం, ప్రేమ, భాగస్వామ్య సంకల్పంపై స్థాపించబడింది. క్రీస్తు శరీరంలోని ఐక్యతను గురించి పేతురు ప్రస్తావించే కొన్ని కీలక మార్గాలు ఇక్కడ ఉన్నాయి.

## క్రీస్తు శరీరంలో ఐక్యత ఎలా?

### దేవుని ప్రజలుగా భాగస్వామ్య గుర్తింపు

పేతురు విశ్వాసుల గుర్తింపును ఏర్పరచబడిన



వంశమును, రాజులైన యాజకసమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారని స్థాపించడం ద్వారా ప్రారంభిస్తాడు (1 పేతురు 2:9). ఈ గుర్తింపు విశ్వాసుల ఐక్యతను బలపరుస్తుంది. వారికి ఒక సాధారణ ఉద్దేశం, విధిని ఇస్తుంది, అంటే వారిని చీకటిలో నుండి తన అద్భుతమైన వెలుగులోకి పిలిచిన దేవుని స్తుతులను ప్రకటించడం.

### పవిత్రతకు, ప్రేమకు పిలుపు

1 పేతురు 1:22లో, విశ్వాసులు ఒకరిపట్ల ఒకరు యథార్థమైన ప్రేమను కలిగి ఉండాలని, హృదయపూర్వకంగా ఒకరినొకరు ప్రేమించాలని కోరాడు. ఈ ప్రేమ దేవుని సజీవమైన, శాశ్వతమైన వాక్యం ద్వారా వారిని కొత్త జన్మలో పాతుకు పోయేలా చేస్తుంది. సంఘంలో ఐక్య పరిచే శక్తి గల ప్రేమపై పేతురు నొక్కి చెప్పడం ఐక్యతను కాపాడుకోవడంలో కీలకమైనది.

### సామరస్యం, వినయం

1 పేతురు 3:8లో ఐక్యతను స్పష్టంగా పేర్కొన్నాడు, ఇక్కడ అతను విశ్వాసులను ఒకే ఆలోచనతో, సానుభూతితో, ఒకరినొకరు ప్రేమించుకోవాలని, కనికరంతో, వినయపూర్వకంగా ఉండాలని సూచించాడు. ఇది శాంతియుత సహజీవనాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో విభేదాలు అధిగమించడంలో కూడా సహాయపడుతుంది.

### శ్రమలను ఎదుర్కోవడం

1 పేతురు యొక్క ముఖ్యమైన భాగం బాహ్య ఒత్తిళ్ళు, హింసలకు ఎలా ప్రతిస్పందించాలనే విషయం గూర్చి, అన్యజనుల మధ్య మంచి ప్రవర్తనను కొనసాగిస్తూ బాధలను,అన్యాయాన్ని సహించమని పేతురు విశ్వాసులను ప్రోత్సహిస్తున్నాడు (1 పేతురు 2:12, 1 పేతురు 3:16-17). ఈ సామూహిక ఓర్పు, ప్రతికూల పరిస్థితులలో ఆదర్శప్రాయమైన ప్రవర్తన విశ్వాసుల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి కూడా ఉపయోగపడుతుంది.

### ఐక్యతను పెంపొందించడంలో పెద్దల పాత్ర

1 పేతురు 5:1-5లో, పేతురు పెద్దలతో మాట్లాడుతూ, దేవుని మందను ఇష్టపూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా, మందకు ఉదాహరణగా ఉంటూ, తమకు అప్పగించిన వారిపై ప్రభువులుగా ఉండకుండా వారిని కాయవలెనని కోరాడు. ఈ రకమైన నాయకత్వం చర్చిలో గౌరవం, విధేయత, ఐక్యతను పెంపొందిస్తుంది.

### ఐక్యతతో సాతానుని ప్రతిఘటించడం

చివరగా, పేతురు ఆధ్యాత్మిక యుద్ధంలో ఐక్యత కోసం పిలుపునిచ్చాడు, విశ్వాసులు తమ విశ్వాసంలో స్థిరంగా నిలబడాలని, సాతానుని ఎదిరించాలని, ప్రపంచమంతటా వారి సోదరభావం ద్వారా ఉమ్మడి శత్రువుపై ఈ భాగస్వామ్య పోరాటం వివిధ ప్రాంతాలలోని విశ్వాసులను ఏకం చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నాడు (1 పేతురు 5:9).

ఈ వాక్య భాగాలు, భాగస్వామ్య గుర్తింపు, పరస్పర ప్రేమ, వినయం, నీతివంతమైన ప్రవర్తన, బాధ్యతాయుతమైన నాయకత్వం, చెడుకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిఘటనపై కేంద్రీకృతమై, క్రీస్తు శరీరంలో ఐక్యతకు పేతురు బలమైన పునాది వేస్తున్నాడు. ఐక్యత సంఘం యొక్క సాక్ష్యాన్ని ప్రపంచం ముందు బలపరుస్తుంది. సమాజం యొక్క ఆధ్యాత్మిక శ్రేయస్సు, స్థితిస్థాపకతకు చాలా అవసరం అని అతని సందేశం.

### ముగింపు

చివరగా, తన పుస్తకం, 'ది చర్చ్ బిఫోర్ ఎ వాచింగ్ వరల్డ్'లో, ఫ్రాన్సిస్ షేఫర్ ఇలా రాశాడు, "క్రీస్తు వధువుగా, సంఘం తనను తాను పవిత్రంగానూ, విశ్వసనీయంగానూ కాపాడుకోవాలి. అలా జీవించడానికి, "రెండు ముఖ్యమైన సూత్రాలు: మొదటిది, సిద్ధాంతం, ప్రవర్తనకు సంబంధించి కనిపించే సంఘం యొక్క స్వచ్ఛత. రెండవది, నిజమైన క్రైస్తవులందరిలో ఎవరు ఎక్కడివారనే దానితో సంబంధం లేకుండా గమనించదగిన ప్రేమ, ఏకత్వం.

యేసయ్య చేసిన ప్రధానయాజక ప్రార్థన మనలో నెరవేరునుగాక!

**- జాన్ క్రిస్టోఫర్,** హైదరాబాద్



# పాపము

గత సంచిక తర్వాత...

## పాపం యొక్క పరిధి

ఆదాము పతనం తనపై, అతని వారసులపై వినాశకరమైన పరిణామాలకు దారి తీసింది అనేది పాత, కొత్త నిబంధనలలో సాధారణ బోధ. దావీదు ఇలా అన్నాడు, "నేను పాపములో పుట్టినవాడను, పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను" (కీర్తనలు 51:5). మనుషులందరూ విఫలమయ్యారు (రోమా 1:18-32; 2:1-29, 3:9-20). "అందరూ పాపము చేసి దేవుని మహిమను పొందలేక పోతున్నారు" (రోమా3:23). వీటిని బట్టి పాపము సార్వత్రికము అని తెలుస్తుంది.

## పాపాన్ని దాచలేము

మీ పాపం మిమ్మల్ని పట్టుకొనును (సంఖ్యా 32:23). పాపం మాత్రమేకాదు, పాపి కూడా బయటపడతాడు. దేవుడు దాచిన పాపాలను చూస్తాడు, వాటిని వెలికితీస్తాడు. ఆదాము, కయీను, ఆకాను, అననీయ, సప్పీరాలు దేవుని నుండి విషయాలు దాచడానికి ప్రయత్నించి విఫలమయ్యారు.

## పాపం యొక్క కొన్ని మూలాలు

1. సాతాను – వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు (యోహాను 8:44)
2. లోకము – ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలోనుండదు. లోకములో ఉన్నదంతయు, అనగా శరీరాశయు నేత్రాశయు జీవపుడంబమును తండ్రివలన పుట్టినవి కావు; అవి లోకసంబంధమైనవే (1 యోహాను 2: 15-16)
3. హృదయము – దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు, దేవ దూషణలు, హృదయములో నుండియే వచ్చును (మత్తయి 15:19). హృదయము అన్నిటికంటె మోసకరమైనది, అది ఘోరమైన వ్యాధికలది, దాని గ్రహింపగలవాడెవడు? (యిర్మీయా 17:9).
4. స్వకీయ దురాశ – "దేవుడు చెడుచేత శోధింపబడడు, ఆయన ఎవనిని శోధించడు; ఎవడైనను శోధింపబడినప్పుడు నేను దేవునిచేత శోధింపబడుచున్నానని అనకూడదు. ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును. (యాకోబు 1:13-14)

## పాపాలు - కొన్ని రకాల జాబితా

1. నిర్గమ.కా. 20:3-17 (పది ఆజ్ఞలు): విగ్రహారాధన, శపించడం, సబ్బాతు

ఉల్లంఘించడం, తల్లిదండ్రులకు అవిధేయత, హత్య, వ్యభిచారం, దొంగతనం, అబద్ధం, దురాశ.

2. 1 కొరింథీ 6:9,10: అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి; జారులైనను విగ్రహారాధకులైనను వ్యభిచారులైనను ఆడంగి తనము గలవారైనను పురుష సంయోగులైనను, దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు.

3. రోమా 1:29–31: దుర్నీతి, దుష్టత్వము, లోభము, ఈర్ష్య, మత్సరము, నరహత్య, కల హము, కపటము, వైరము, కొండెములు, అపవాదము, దేవ ద్వేషము, హింస, అహంకారము, బింకములు, చెడ్డవాటిని కల్పించుట, తల్లిదండ్రులకు అవిధేయులు, అవివేకులు, మాట తప్పుట, అనురాగ రహితము, నిర్దయ.

4. 1 తిమో1:9–11: ధర్మవిరోధము, అధర్మం, అవిధేయత, అపవిత్రత, అసభ్యత, భక్తి హీనత, వ్యభిచారి, పురుష సంయోగులు, పితృహంతకులు, మాతృహంతకులు, నరహంతకులు, అబద్ధికులు, అప్రమాణికులు.

5. కొలొస్సీ 3:5–8: జారత్వము, అపవిత్రత, కామాతురత, దురాశ, విగ్రహారాధన, ధనాపేక్ష, కోపము, ఆగ్రహము, దుష్టత్వము, దూషణ.

6. గల. 5:19–21: జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషము, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు.

7. మార్కు 7:20–23: దురాలోచనలు, జారత్వము, దొంగతనము,నరహత్య, వ్యభి చారము, లోభము, చెడుతనము, కృత్రిమము, కామవికారము, మత్సరము, దేవదూషణ, అహంభావము, అవివేకము.

8. మార్కు 11:15–18 దైవద్రోహము

## పాపం యొక్క ఫలితాలు

పాపం యొక్క పరిణామాలు నిస్సందేహంగా చాలా ఎక్కువ. వారసత్వ పాపమువలనను, ఆపాదించబడిన పాపము వలనను, వ్యక్తిగత పాపము వలనను మనము ముమ్మారు శిక్షావిధిలో ఉన్నవారము. ఈ పాపము అంతటికి న్యాయమైన శిక్ష మరణమే (రోమా 6:23), కేవలము భౌతికమైన మరణమే కాక నిత్య మరణం (ప్రకటన 20:11–15).

1. పాపం యొక్క జీతం మరణం" (రోమా 6:23) – మనిషి చేసిన పాపం ఫలితంగా, మూడు మరణాలు ఉన్నాయి. మరణం మనిషిని నిర్మూలించదని గుర్తుంచుకోండి, అది కేవల ము వేరుచేస్తుంది.

ఎ. ఏదేను తోటలో అది మనిషిని దేవుని నుండి ఆధ్యాత్మికంగా వేరు చేసింది; ఇది ఆధ్యాత్మిక మరణం (యెషయా 59:1–2).

బి. సహజ మరణంలో, ఇది శరీరం నుండి ఆత్మను వేరు చేస్తుంది. ఇది భౌతిక మరణం.

సి. అంతిమ మరణంలో, అది ఎప్పటికీ దేవుని దయ నుండి మనిషిని వేరు చేస్తుంది. ఇది నిత్య మరణం (యెహెజ్కేలు 18:20, ప్రకటన 20:14)

2. తప్పిపోయాడు – మనిషి దేవునికి దూరమయ్యాడు, మనిషి స్వర్గం నుండి తప్పిపోయాడు (లూకా 15:24)

3. శిక్షింపబడ్డాడు – ఇది దేవుని తీర్పును సూచించే న్యాయపరమైన పదం (యోహాను 3:18)

4. అపరాధ భావన – మనస్సాక్షి బాధతో ఉన్నట్లు సూచించే సూచన పదం (ఆది 26:10)



5. వినాశనం-విధ్వంసం, అపరాధాన్ని సూచించే పదం (1 తిమో 6:9)

6. శిక్ష – దండన విధించడాన్ని సూచించే పదం (మత్తయి 25:46)

7. శాశ్వతమైన అగ్ని – దండన గడువును సూచించే పదం (యూదా 7)

8. నరకం – సాతాను, అతని అనుచరుల నివాసం (మత్తయి 25:41)

9. అగ్ని సరస్సు – రెండవ మరణం (ప్రక. 20:14)

## క్షమించరాని పాపం ఏంటి?

క్షమించరాని పాపం లేదా "పరిశుద్ధాత్మ దూషణ" మార్కు 3:22-30, మత్తయి 12:22-32లో ప్రస్తావించబడింది. ఉద్దేశపూర్వకంగా సత్యాన్ని తిరస్కరించడానికి పరిశుద్ధాత్మను దూషణ చేయడానికి ఎంచుకున్నారు. క్షమించరాని పాపం నిరంతర అవిశ్వాసం. క్రీస్తును తిరస్కరించినందుకు మరణించిన వ్యక్తికి క్షమాపణ లేదు. పాపం, ధర్మం, తీర్పు నుండి రక్షింపబడని వారిని దోషిగా చేస్తుంది (యోహాను 16:8). ఒక వ్యక్తి ఆ నమ్మకాన్ని ప్రతిఘటించి, పశ్చాత్తాపపడకుండా ఉంటే, అతడు నరకాన్ని ఎంచుకుంటాడు.

## పాపానికి పరిహారం

మానవ ప్రయత్నాలు – మానవుడు దేవుని విమోచనను అంగీకరించడానికి ఇష్టపడడు, మానవ మార్గాల ద్వారా మోక్షానికి వెళ్ళడానికి ప్రయత్నిస్తాడు.


1. స్వనీతి కోసం ప్రయత్నిస్తాడు (యెషయా 64:6) – స్వనీతి మురికిగుడ్డలుగా ఉంటుంది. దేవుని నీతి పొందాలి.

2. సంస్కరణ ప్రయత్నాలు (తీతు 3:5) – మనము నీతిని అనుసరించి చేసిన క్రియలమూలముగా కాదు.

3. ధర్మశాస్త్రము అనుసరించుట మూలముగా నీతిమంతునిగా ఉండడానికి చేసే ప్రయత్నాలు (గలతీ 2:16).

4. పాత జీవితాన్ని మార్చుకోవడానికి ప్రయత్నిస్తాడు (ఎఫెసీ 4:24)

5. దేవుని కృప ద్వారా అతనికి మోక్షం




అవసరమైనప్పుడు మంచిపనుల ద్వారా రక్షింపబడడానికి అతను కృషి చేస్తాడు (ఎఫెసీ 2:8-9)

## మానవ ప్రయత్నాలు - చెల్లవు

ఏ మనిషి పాపం లేనివాడు కాదు. ఏ మనిషి పాపం నుండి తననుతాను పవిత్రపరచుకోలేడు. యోబు 9:30,31; కీర్తన 49: 7 – 9 ఎవడును ఏ విధము చేతనైనను తన సహోదరుని విమోచింపలేడు. వాడు కుళ్ళు చూడక నిత్యము బ్రతుకునట్లు వాని నిమిత్తము దేవుని సన్నిధిని ప్రాయశ్చిత్తము చేయగల వాడు ఎవడును లేడు. వారి ప్రాణవిమోచన ధనము బహు గొప్పది అది ఎన్నటికిని తీరక అట్లుండవల సినదే.

యిర్మీయా 2: 22 నీవు క్షారముతో కడుగుకొనినను విస్తారమైన సబ్బు రాసుకొనినను నీ దోషము మరకవలె నాకు కనబడుచున్నది; ఇది ప్రభువగు యెహోవా వాక్కు.

కాబట్టి మనందరికీ రక్షకుడు అవసరం. పాపానికి దేవుడే పరిహారం.

2 కొరింథీ 5:21: ఎందుకనగా మనమాయనయందు దేవునినీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను.

వారసత్వ పాపము, ఆపాదించబడిన పాపము, వ్యక్తిగత పాపము అన్నియు యేసు సిలువలో సిలువ వేయబడ్డాయి. ఇప్పుడు యేసుక్రీస్తు నందు విశ్వాసము ద్వారా "ఆయన కృపా మహదైశ్వర్యమును బట్టి యేసుక్రీస్తు రక్తమువలన మనకు విమోచనము కలుగుచున్నది" (ఎఫెసీ 1:7). **– సమాప్తం**

**– డా. జె. రత్న గ్రేస్,** వైజాగ్

కథానిక



# ఆ 'జాగ్రత్త'

జాగ్రత్త, రోజూ మాట్లాడే పదమే గానీ ఈ రోజెందుకో కొత్తగా ఉంది. స్వరూప్ ఇంట్లో నుంచి బయటికి వస్తుండగా వర్షం జోరుగా పడుతుంది. బయట ఆడుకొంటున్న రెండు సంవత్సరాల తన అబ్బాయి పడుతూ లేస్తూ వాటర్‌లో జారిపోతుంటే తండ్రి స్వరూప్ 'జాగ్రత్త' అని బాబుని పడకుండా పట్టుకున్నాడు.

అప్పుడే కంగారుగా బయటికి వెళ్తున్న భార్య తన స్కూటీ స్టాండ్ తీయకుండానే వెళ్ళిపోతుంటే స్వరూప్ అనుకోకుండానే 'జాగ్రత్త స్టాండ్ తీసి వెళ్ళు' అని అంటాడు. ఇంతలో తన టైమ్ చూసుకోగానే ఆఫీస్‌కి లేట్ అవుతుందేమో అని కంగారుతో తొందరగా బయలుదేరి మనసులో ఈరోజు మా బాస్‌తో తిట్టించుకోకుండా ముందుగానే వెళ్ళాలని హడావుడిగా బయలుదేరతాడు. బాస్ లేట్ అయింది ఏంటి? అని కోపపడినా, తిట్టినా జాబ్ పోకుండా జాగ్రత్త పడాలని తన మనసులో ముందుగానే అనుకునే వెళతాడు. ఎట్టకేలకు ఆఫీస్‌కి ఇన్‌టైమ్ కే వెళతాడు.

కొంత సమయం తర్వాత హాస్టల్‌లో ఉన్న ఇయు తమ్ముడి నుండి ఫోన్ కాల్ వస్తుంది. "అన్నా ఈ సంవత్సరం పరిచర్య గురించి మనము ఏం చేద్దాం? కమిటీ మీటింగ్ ఎప్పుడు పెట్టుకుందాం?" అని తమ్ముడు మాట్లాడుతూ ఉండగా ఆ మాటలను ఆపే ప్రయత్నం చేస్తూ "తమ్ముడూ, ఇప్పుడే ఆఫీస్‌కి వచ్చాను చాలా బిజీగా ఉన్నాను, తర్వాత చేయి" అని ఫోన్ కట్ చేసి తన పనిలో బిజీ అయిపోతాడు. ఆఫీస్ పని ముగించుకుని వాచ్‌మెన్‌తో 'ఈ డోర్స్ జాగ్రత్తగా లాక్ చెయ్' అని చెప్పి ఆఫీసు నుండి బయలుదేరాడు. దారి మధ్యలో ఉండగా, హాస్టల్ నుండి ఇయు తమ్ముడు ఫోన్. అసహనంగానే లిఫ్ట్ చేస్తాడు.



అవతల నుంచి తమ్ముడు "అన్నా ఈ సంవత్సరం పరిచర్య ఎలా చేద్దాం? అని అడిగితే తమ్ముడూ, నేను ఆఫీసు నుండి ఇంటికి వెళుతున్నాను, బిజీగా ఉన్నాను, తర్వాత చేస్తాను అంటూ ఫోన్ కట్ చేస్తాడు.

ఇంతలో తన పాపను స్కూల్ నుండి తీసుకురావాలని గుర్తుకువచ్చి స్వరూప్ స్కూల్ దగ్గరికి వెళ్తాడు. అప్పటికే పాప చాలాసేపటి నుండి ఎదురుచూస్తుంది. తన పాపను తీసుకుని వెళ్ళబోతూ అక్కడే ఉన్న టీచర్‌ని 'మా పాప ఎలా చదువుతుంది? మంచిగా చదువుతుందా? ఈ స్కూల్లో స్టడీస్ బాగుంటాయంటే ఇక్కడ చేర్చాను. మిమ్మల్ని నమ్మి మా పాపను మీ చేతుల్లో పెట్టాము. జాగ్రత్తగా చదివేలా చూసుకోండి' అని చెప్పి వెంటనే ఇంటికి బయలుదేరాడు.

రాత్రి 8 గం॥లకు మరలా హాస్టల్ నుండి

తమ్ముడు కాల్ చేసి అన్న కమిటీ మీటింగ్ ఎప్పుడు పెట్టుకుందాం? పరిచర్య గురించి ఎప్పుడు మాట్లాడుకుందాం? అని అడుగుతాడు. స్వరూప్ 'ఇప్పుడు కాదులే తమ్ముడు, ఇంకా టైమ్ ఉంది. కొన్ని రోజుల తర్వాత పెట్టుకుందాం' అన్న సమాధానంతో తమ్ముడు నిరాశతో సరే అని అంటాడు.

స్వరూప్ రోజు వారి పనులు ముగించుకుని అల సటతో నిద్రలోకి జారుకుంటాడు. తెల్లవారగానే లేచి అలవాటుగా తన బైబిల్‌ను తీసుకొని క్వైట్‌టైమ్‌కి కూర్చొని కొలస్సీ 4వ అధ్యాయం చదవడం ప్రారంభి స్తాడు. 17వ వచనం "...మరియు ప్రభువునందు నీకు అప్పగింపబడిన పరిచర్యను నెరవేర్చుటకు దాని గూర్చి జాగ్రత్త పడమని అర్ఖిప్పుతో చెప్పుడి" అని స్వరూప్ చదువుతుండగా ఒక్కసారిగా గుండెలో ఏదో తెలియని అలజడి మొదలవుతుంది. స్వరూప్‌కి నిన్నటి రోజు గుర్తొచ్చి ఎన్నిసార్లు జాగ్రత్త అని తన పనుల్లో, తన కుటుంబం పట్ల సరి చూసుకొంటూ వెళ్ళాడో, దేవుని పనిని నిర్లక్ష్యం చేసిన విధానం గుర్తుకు వచ్చింది. ఇయు తమ్ముడు తనకి ఫోన్‌చేసి ఎన్నిసార్లు అడిగినా తను స్పందించిన విధానం గుర్తుకు వచ్చి చాలా బాధపడ్డాడు. ఇక నుంచి అలా కాకూడదు అనే నిర్ణయానికి వచ్చాడు.

మరలా ఆ రోజంతా గత రోజులానే గడిచింది. మనసులో పరిచర్య చేయాలనే ఆలోచన ఉన్నా ఆచరణలో మాత్రం పెట్టలేకపోతున్నాడు. ఆ రోజు సాయంత్రం ఇజియఫ్‌కు కుటుంబంతో కలిసి వెళ్ళాడు.

ఆ రోజు ఇజియఫ్‌లో 'స్టూడెంట్స్ మినిస్ట్రీ' అనే అంశం గూర్చి స్పెషల్‌టాక్ పెట్టారు. వచ్చిన స్పీకర్ నేటి విద్యార్థుల, క్యాంపస్‌ల పరిస్థితి, వారు రక్షణ పొందాల్సిన అవసరత, దేవుడు మనకు ఇచ్చిన విజన్, మిషన్ గూర్చి చక్కగా వివరించాడు. తర్వాత పరిచర్య గురించి డిస్కషన్ పెట్టారు. అనేక అంశాలు మాట్లాడుతూ 'పరిచర్యలో నాణ్యత రానురాను తగ్గిపోతుంది' అని ఒక అన్న అన్నాడు. నిజమేనని అందరూ ఒప్పుకొన్నారు. స్వరూప్ అయితే దాని గురించి మరింత వివరంగా మాట్లాడాడు.

చివరిగా, స్పీకర్‌గా వచ్చిన అన్న మాట్లాడుతూ, "పరిచర్యలో నాణ్యత తగ్గిపోతుంది అని మాట్లాడు తున్నాం, ఎందుకు తగ్గిపోతుందో తెలుసా? మన జీవితాల్లో నాణ్యత లేనప్పుడు మన పరిచర్యలో



కూడా నాణ్యత ఉండదు. నేటి దినాల్లో దేవుని పనిని భయం, భక్తి, శక్తి లేకుండా చేస్తున్నాం. పితరులు త్యాగపూరితంగా, దేవుని పిలుపు, నడిపింపుతో కట్టిన ఈ పరిచర్యను మనం అజాగ్రత్తతో, నిర్లక్ష్యంతో, ఉదాసీనతతో ఇంకా చెప్పాలంటే మన నాణ్యతలేని జీవితాలతో నాశనం చేస్తున్నాము. పరిచర్యలో నాణ్యత పెంచడానికి మనం ఏం చేస్తున్నాం? దీని గురించి ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ వ్యక్తిగతంగా పరిశీలించుకోవాలి, పరిచర్య నాణ్యతకు బాధ్యత తీసుకోవాల్సిందే" అంటూ సూటిగా, స్పష్టంగా చెప్పి ప్రార్థన చేసి ముగించాడు.

'అజాగ్రత్తతో, నిర్లక్ష్యంతో, ఉదాసీనతతో' అనే మాటలు స్వరూప్ గుండెల్లో బాకుల్లా దిగాయి. తన వ్యక్తిగత జీవితంలో తీసుకున్నంత శ్రద్ధ, జాగ్రత్త దేవుడు తనకు అప్పగించిన పరిచర్యలో తీసుకోలేదని అర్థమైంది. ఇంటికి వెళ్ళి బైబిల్‌ని మంచం మీద పెట్టి "ప్రభువా నన్ను క్షమించు, నీ పనిని నా పని వలె, నా పని కంటే జాగ్రత్తగా చూడాలనే విషయం మర్చిపోయాను. నీవు నా కొరకు సిలువలో పెట్టిన ప్రాణత్యాగాన్ని కూడా మర్చిపోయాను. బైబిల్ స్టడీస్, మైక్రో ప్రేయర్ సెల్స్, వ్యక్తిగత సువార్త ఎవరో ఒకరు చేస్తారులే అని నిర్లక్ష్యంతో ఇంతకాలం జీవించాను, ఉపవాస ప్రార్థనలకు వెళ్ళలేదు, కొత్తగా రక్షణ పొందిన విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపలేదు, పరిచర్యలో నాణ్యత తగ్గడానికి కారణం నేనే దయతో నన్ను క్షమించు, ఇకనుండి నీ పనిని జాగ్రత్తగా చేయడానికి సహాయం చేయండి" అని స్వరూప్ దేవున్ని బ్రతిమాలాడు.

– టి రవి కిషోర్, ఏలూరు

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 14-08-2024**
**Date and place of posting: on 17th at GUNTUR**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# అవినీతి జెండాలు

దేశం నిండా
అవినీతి జెండాలే
గాలి కూడా
లంచమిచ్చిన వాడివైపే వీస్తుంది

ఆదివారం చర్చీల్లో
ముందువరుస కుర్చీల్లో
దంబాలుపోయిన ఆడంబరం కూడా
ఆఫీసు గుమస్తాల ముందు
అప్రయత్నంగా లొంగిపోతుంది.

ప్రజాస్వామ్యం కదా !
ప్రజలకూ ప్రభుత్వానికీ
తేడా లేదు
అంతా అరాచకమే !

దారి తప్పడమే ధర్మంగా భాసిల్లే రాజ్యంలో
నీతి నియమాల బ్రతుకు నేరమై బోనెక్కుతుంది

న్యాయాన్ని వెదుక్కుంటూ
నిజాయితీగా నిలదొక్కుకొంటూ
ప్రవాహానికి ఎదురీదే
పరాక్రమశాలురు మాత్రం కొందరే
వారికి తెలుసు
అంతిమ విజయం అవినీతిది కాదని !

– డా. తాళ్ళూరి ప్రసాద్